


# పోరు తెలంగాణ

డిజిటల్ తెలుగు దినపత్రిక




కరీంనగర్ సంపుటి : 11 సంచిక : 322 బుధవారం 09-09-2026 ఎడిటర్ : కొండ ప్రవీణ్ కుమార్ పేజీలు : 04 వెల : 04

## ఇది దుశ్శాసన సభ.. మహిళా నేతల జుట్టు పట్టుకుని ఈడ్చేస్తారా?



- శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళితే ఉక్కుపాదం మోపారన్న కేటీఆర్
- తాము ఎలాంటి అన్‌పార్లమెంటరీ భాష మాట్లాడలేదని వెల్లడి
- ఈ దాడి వెనుక రేవంత్ రెడ్డి కుట్ర ఉందని ఆరోపణ

ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు - మిగతా 2 లో

## మహిళా ఎమ్మెల్యే చీర లాగిన వాళ్లను వదిలిపెట్టం



- బీఆర్ఎస్ సభ్యులు సభలోకి రాకుండా అడ్డుకోవాలనే కుట్రతో రేవంత్ ప్రభుత్వం ఉందన్న హరీశ్ రావు
- శాసనసభ చరిత్రలో ఈరోజు ఒక చీకటి రోజుగా మిగిలిపోతుందని వ్యాఖ్య
- శాసనసభ కౌరవసభలా మారిందని విమర్శ

తెలంగాణ శాసనసభ సమావేశాల - మిగతా 2 లో

# తెలంగాణలో కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర

- బీజేపీ వ్యతిరేక ఓట్లపై ప్రత్యేక నిఘా ఉందని ఆరోపణ
- కొడంగల్‌లో 81 వేల ఓట్లు అనామలీస్ జాబితాలో ఉన్నాయని వెల్లడి
- 2029లో మోదీ ఓటమికి పునాది అన్న సీఎం
- పేదలు, గిరిజనుల ఓట్లపైనా కుట్ర జరుగుతోందని ఆరోపణ
- లౌకిక శక్తులు ఏకం కావాలని రేవంత్ పిలుపు



2లో

తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

# నా రిటైర్మెంట్ వరకు గడువు అడుగుతారా ఏంటి?

ఆరావళి కమిటీకి సీజేఐ చురకలు

- ఆరావళి కమిటీ పనితీరుపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం
- వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు గడువు పొడిగింపును తిరస్కరించిన ధర్మాసనం
- నవంబర్ 30వ తేదీలోగా తుది నివేదిక సమర్పించాలని స్పష్టమైన ఆదేశం
- గడువులోగా పూర్తిచేయకుంటే కమిటీని పునర్వ్యవస్థీకరిస్తామని హెచ్చరిక
- అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకోవాలని కమిటీకి సూచించిన కోర్టు

ఆరావళి పర్వత శ్రేణుల నిర్వచనం, పరిరక్షణపై అధ్యయనం చేసేందుకు ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ (హెచ్ పీసీ) పనితీరుపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. తుది నివేదిక సమర్పణకు వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు గడువు కావాలని కమిటీ కోరడాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. - మిగతా 2 లో



# మహిళలపై అనుచితమైన వ్యాఖ్యలు సహించం

డీఎంకేకు సీఎం విజయ్ వార్నింగ్!

- డీఎంకే ప్రభుత్వంపై సీఎం విజయ్ తీవ్ర అవినీతి ఆరోపణలు
- అసెంబ్లీ సాక్షిగా పాత ఫైళ్లను, కమిషన్ల వివరాలను ప్రస్తావించిన సీఎం
- స్టాలిన్, ఉదయనిధి, సెంథిల్ బాలాజీ పేర్లను పేర్కొంటూ విమర్శలు
- మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- ప్రజల తీర్పును గౌరవించకపోవడంతోనే డీఎంకే ప్రతిపక్షంలో ఉందని వ్యాఖ్య



2లో

తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ ప్రతిపక్ష డీఎంకేపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇవాళ అసెంబ్లీలో పోలీసు శాఖ పద్దులపై జరిగిన చర్చకు సమాధానమిస్తూ, డీఎంకే పాలనలో జరిగిన అవినీతిని, అక్రమాలను ఆధారాలతో సహా బయటపెట్టారు. డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్, ఆయన కుమారుడు ఉదయనిధి స్టాలిన్ సహా పలువురు సీనియర్ నేతలపై ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగా సీఎం విజయ్ మాట్లాడుతూ.. రాజకీయ విమర్శలు సహజమేనని, కానీ మహిళలపై అనుచితమైన, కించపరిచే వ్యాఖ్యలు

## ఢిల్లీ కూడా టోక్యోలా మారగలదు జపాన్‌లోని భారతీయుడి ఆకాంక్ష



- టోక్యో నిర్మలమైన ఆకాశాన్ని చూపిస్తూ ఓ భారతీయుడి వీడియో
- ఢిల్లీ ఆకాశం అలా ఎందుకు ఉండదని సూటి ప్రశ్న
- ఢిల్లీ కంటే టోక్యో జనాభా ఎక్కువే అయినా కాలుష్యం తక్కువ
- ప్రయత్నిస్తే ఢిల్లీని కూడా పరిశుభ్రంగా మార్చవచ్చని ఆశాభావం

జపాన్ రాజధాని టోక్యోలో నివసిస్తున్న ఓమ్ అనే భారతీయుడు సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఒక వీడియో ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. - మిగతా 2 లో

## స్టాక్ మార్కెట్‌కు మళ్లీ నష్టాలు.. 382 పాయింట్లు పతనమైన సెన్సెక్స్

- 118 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ
- ఐటీ, మెటల్ షేర్లలో భారీ అమ్మకాలు
- 23,800 స్థాయిపై నిఫ్టీకి ఒత్తిడి
- మిడ్‌క్యాప్ పతనం, స్వల్పంగా పెరిగిన స్మాల్‌క్యాప్
- ఫార్మా, హెల్త్‌కేర్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు



దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, చమురు ధరల్లో అస్థిరత, వడ్డీ రేట్లు మరింత పెరగొచ్చన్న ఆందోళనలు ఇన్వెస్టర్లపై ప్రభావం చూపాయి. ముఖ్యంగా ఐటీ, మెటల్, ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో సూచీలు దిగజారాయి. - మిగతా 2 లో

## ఏఐ ఎఫెక్ట్.. రికార్డు స్థాయికి చేరిన ప్రపంచ కుబేరుల సంపద!

- ప్రపంచ కుబేరుల సంపద 15.1 ట్రిలియన్ డాలర్ల రికార్డు స్థాయికి చేరిక
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పెట్టుబడులతో భారీగా పెరిగిన ఆస్తులు
- ప్రపంచవ్యాప్తంగా 3,795కి ఎగబాకిన బిలియనీర్ల సంఖ్య
- కుబేరుల సంఖ్యలో అగ్రస్థానంలో కొనసాగుతున్న ఉత్తర అమెరికా



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో పెట్టుబడులు వెల్లువెత్తడంతో ప్రపంచ కుబేరుల సంపద సరికొత్త రికార్డు సృష్టించింది. 2025 నాటికి బిలియనీర్ల మొత్తం ఆస్తి 15.1 ట్రిలియన్ డాలర్లకు చేరినట్లు వెల్త్ ఇంటెలిజెన్స్ సంస్థ 'అల్ట్రాటా' తన 'బిలియనీర్ సెన్సస్ 2026' నివేదికలో వెల్లడించింది. గత ఏడాదితో పోలిస్తే బిలియనీర్ల సంఖ్య 8.2 శాతం పెరిగి 3,795కి చేరగా, వారి సంపద 12.8 శాతం మేర వృద్ధి చెందింది. - మిగతా 2 లో

## నెల్లూరులో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కు ఘనస్వాగతం



- స్వర్ణ భారత్ ట్రస్ట్ రజతోత్సవాలకు హాజరైన యూపీ సీఎం యోగి
- నెల్లూరులో ఘన స్వాగతం పలికిన మంత్రులు నారాయణ, సత్యకుమార్
- అక్షర విద్యాలయంలో నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని పరిశీలన
- శిక్షణ పొందుతున్న యువతతో ముఖాముఖి నిర్వహించిన ఆదిత్యానాథ్
- ట్రస్ట్ సేవలను, విద్యాసంస్థల నిర్వహణను ప్రశంసించిన యూపీ సీఎం

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ సోమవారం నెల్లూరు జిల్లా - మిగతా 2 లో

# వైసీపీది ఉగ్రవాదుల తరహా రాజకీయం ఫ్యాక్ట్‌తో కౌంటర్ ఇవ్వండి: సీఎం చంద్రబాబు

- రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీరందించి తెలుగు తల్లికి జలహారతి పడతామన్న సీఎం
- 'వాటర్ మ్యాన్'గా ఎకనామిక్ టైమ్స్ కథనంపై హర్షం
- సీఎంకు నేతల స్టాండింగ్ ఒవేషన్
- వైసీపీ ఫేక్ ప్రచారాన్ని ఫ్యాక్ట్‌తో తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపు
- కష్టకాలంలో అండగా నిలిచిన కార్యకర్తలకు సముచిత గౌరవమని హామీ
- టీడీపీ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్.. పార్టీ శ్రేణులకు చంద్రబాబు దిశానిర్దేశం



2లో

రాష్ట్రంలోని పోలవరం సహా అన్ని సాగునీటి ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, ప్రతి ఎకరాకు నీరు

## కార్యకర్తలే పార్టీకి బలం వారిని ఉన్నతస్థాయికి తీసుకురండి

లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో చంద్రబాబు



- సమస్యల పరిష్కారంలో మంత్రులు పూర్తి బాధ్యత వహించాలని స్పష్టీకరణ
- స్వర్ణాంధ్ర విజన్-2047ను క్షేత్రస్థాయిలో అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని పిలుపు
- ఆర్థిక ఇబ్బందులున్నా ప్రతి నియోజకవర్గానికి రూ.1 కోటి కేటాయింపు
- టెక్నాలజీతో వందేళ్ల పనిని పదేళ్లలో పూర్తి చేయవచ్చన్న ముఖ్యమంత్రి

తెలుగుదేశం పార్టీ నిర్వహించిన లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి - మిగతా 2 లో

# ఢిల్లీ కూడా టోక్యోలా మారగలదు.. జపాన్‌లోని భారతీయుడి ఆకాంక్ష

మొదటిపేజీ తరువాయి - టోక్యోలోని స్వచ్ఛమైన నీలాకాశాన్ని చూపిస్తూ, మన దేశ రాజధాని ఢిల్లీలో ఆకాశం ఎందుకు ఇలా నిర్మలంగా ఉండదని ఆయన ప్రశ్నించారు. ఈ వీడియో నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటూ, రెండు నగరాల మధ్య నెలకొన్న భిన్నమైన వాతావరణ పరిస్థితులపై చర్చకు దారితీసింది. భారత్‌లో కాలుష్యానికి అధిక జనాభానే ప్రధాన కారణమని చాలామంది భావిస్తుంటారని, కానీ వాస్తవానికి ఢిల్లీ కంటే టోక్యో జనాభా ఎక్కువేనని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. అయినప్పటికీ టోక్యోలో గాలి, పరిసరాలు ఎంతో పరిశుభ్రంగా ఉంటాయని తన వీడియోలో వివరించారు. "భారతీయ ఆకాశాలతో ఉన్న సమస్య" అనే క్యాప్షన్‌తో ఆయన ఈ పోస్ట్‌ను పంచుకున్నారు. తన విదేశీ స్నేహితుల్లో కొందరు భారతదేశం అనగానే జనసమ్మర్దంతో కూడిన, దుమ్ముధూళితో నిండిన ప్రాంతంగా భావిస్తుంటారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి వారికి హిమాచల్ ప్రదేశ్, కేరళ, ఈశాన్య రాష్ట్రాల వంటి అందమైన, అత్యంత పరిశుభ్రమైన ప్రాంతాల గురించి తాను వివరిస్తుంటానని ఆయన పేర్కొన్నారు. మన దేశ రాజధానిలో కూడా స్వచ్ఛమైన ఆకాశం, ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంటే పౌరుల జీవన ప్రమాణాలు మెరుగుపడటమే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో భారత్ ప్రతిష్ఠ మరింత పెరుగుతుందని ఓమ్ అభిప్రాయపడ్డారు. అందరూ కలిసికట్టుగా కృషి చేస్తే ఇది కచ్చితంగా సాధ్యమవుతుందని ఆయన ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.

# స్టాక్ మార్కెట్‌కు మళ్లీ నష్టాలు.. 382 పాయింట్లు పతనమైన సెన్సెక్స్

మొదటిపేజీ తరువాయి - వడ్డీ రేట్లు మరింత పెరగొచ్చన్న ఆందోళనలు ఇన్వెస్టర్లపై ప్రభావం చూపాయి. ముఖ్యంగా ఐటీ, మెటల్, ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో సూచీలు దిగజారాయి. సెన్సెక్స్ 382.62 పాయింట్లు నష్టపోయి 76,132.81 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 118.55 పాయింట్లు కోల్పోయి 23,779.15 వద్ద ముగిసింది. రెండు సూచీలు సుమారు 0.5 శాతం చొప్పున నష్టపోయాయి. నిఫ్టీ సాంకేతికంగా కీలక స్థాయికి చేరిందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. 23,800 స్థాయి గతంలో కీలక మద్దతుగా నిలిచింది. ఇప్పుడు అదే స్థాయి తక్షణ నిరోధంగా మారే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. నిఫ్టీ ఈ స్థాయిని అధిగమించి నిలదొక్కుకోకపోతే అమ్మకాల ఒత్తిడి కొనసాగే అవకాశముందని చెబుతున్నారు. మరోవైపు 23,750-23,700 స్థాయిని తక్షణ మద్దతుగా నిపుణులు చూస్తున్నారు. ఈ స్థాయి కంటే దిగువన నిఫ్టీ ముగిస్తే మరింత అమ్మకాలు జరిగి 23,600 ప్రాంతం వరకు పడిపోయే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారు. నిఫ్టీలో ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ షేర్లు ఎక్కువగా నష్టపోయాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.46 శాతం తగ్గగా, స్మాల్‌క్యాప్ 0.02 శాతం స్వల్పంగా పెరిగింది. రంగాల వారీగా ఐటీ, మెటల్ షేర్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు, రియల్టీ, మీడియా షేర్లు కూడా వెనుకబడ్డాయి. అయితే ఫార్మా, హెల్త్‌కేర్ షేర్లు మాత్రం మార్కెట్ ప్రతికూలతను తట్టుకొని మెరుగ్గా రాణించాయి. అంతర్జాతీయ పరిణామాలు, చమురు ధరల కదలికలపై ఇన్వెస్టర్లు నిశితంగా దృష్టి పెట్టారు.

# ఏఐ ఎఫెక్ట్.. రికార్డు స్థాయికి చేరిన ప్రపంచ కుబేరుల సంపద!

మొదటిపేజీ తరువాయి - గత ఐదేళ్లలో ఇదే అత్యధిక వార్షిక పెరుగుదల కావడం గమనార్హం. ముఖ్యంగా ఏఐ రంగంలో గణనీయమైన పెట్టుబడులు పెట్టిన కంపెనీల మార్కెట్ విలువ భారీగా పెరగడమే ఈ సంపద వృద్ధికి ప్రధాన కారణమని 'అల్ట్రాటా' నివేదిక స్పష్టం చేసింది. సెమీకండక్టర్లు, డేటా సెంటర్లు, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి టెక్నాలజీ కంపెనీల వ్యవస్థాపకులు, ప్రధాన వాటాదారులు అత్యధికంగా లాభపడ్డారు. ఈ నివేదిక ప్రకారం, సంపద కేంద్రీకరణ కూడా తీవ్రస్థాయిలో ఉంది. 50 బిలియన్ డాలర్లకు పైగా ఆస్తి ఉన్న 29 మంది 'సూపర్ బిలియనీర్లు' చేతిలోనే 4.1 ట్రిలియన్ డాలర్ల సంపద కేంద్రీకృతమై ఉంది. ఇది మొత్తం బిలియనీర్ల ఆస్తిలో దాదాపు 27 శాతానికి సమానం. ప్రాంతాల వారీగా చూస్తే, 1,337 మంది బిలియనీర్లతో ఉత్తర అమెరికా అగ్రస్థానంలో ఉండగా, ఆ తర్వాత యూరప్ (1,081), ఆసియా (881) ఉన్నాయి. అయితే, ఈ సంపదలో అధిక భాగం స్టాక్ మార్కెట్ విలువలతో ముడిపడి ఉన్నందున, 'ఏఐ'పై సెంటిమెంట్ మారితే ఇందులో హెచ్చుతగ్గులు ఉండవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రాబోయే దశాబ్దంలో సుమారు 6.6 ట్రిలియన్ డాలర్ల సంపద దాదాపు 5,000 మంది వారసులకు బదిలీ అవుతుందని కూడా అల్ట్రాటా అంచనా వేసింది.

# నెల్లూరులో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కు ఘనస్వాగతం

మొదటిపేజీ తరువాయి - పర్యటనకు విచ్చేశారు. వెంకటాచలంలోని స్వర్ణ భారత్ ట్రస్ట్ 25వ వార్షికోత్సవ (రజతోత్సవ) వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు ఆయన జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు రాష్ట్ర మంత్రులు డాక్టర్ పొంగూరు నారాయణ, వై. సత్యకుమార్ సాదరంగా స్వాగతం పలికారు. అక్షర విద్యాలయం పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో దిగిన యోగికి మంత్రులతో పాటు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కుమార్తె, ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్, కుమారుడు హర్షవర్ధన్, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం యోగి అక్షర విద్యాలయం ప్రాంగణంలో ఉన్న సోమా సాంకేతిక శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ నైపుణ్య శిక్షణ పొందుతున్న యువతీయువకులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. వారికి అందుతున్న సాంకేతిక శిక్షణ, భవిష్యత్ అవకాశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్వర్ణ భారత్ ట్రస్ట్ అందిస్తున్న సేవలను, అక్షర విద్యాలయం ద్వారా గ్రామీణ యువతకు ఉపాధి కల్పనకు చేస్తున్న కృషిని యోగి ఆదిత్యానాథ్ ప్రశంసించారు. ప్రాంగణంలో విద్యార్థులు నిర్వహించిన స్కేటింగ్ ప్రదర్శనను కూడా ఆయన ఆసక్తిగా తిలకించారు. మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు స్ఫూర్తితో 2001లో ఏర్పాటైన స్వర్ణ భారత్ ట్రస్ట్, గ్రామీణ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ, ఆరోగ్య సేవలు అందిస్తూ 25 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ రజతోత్సవ వేడుకల్లో భాగంగా యోగి ఆదిత్యానాథ్ భోజనానంతరం ట్రస్ట్ ప్రాంగణానికి చేరుకుని, అక్కడ నిర్వహిస్తున్న ఇతర సేవా కార్యక్రమాలను పరిశీలిస్తారు. అనంతరం ప్రజా మందిరంలో జరిగే ప్రధాన సభలో ముఖ్య అతిథిగా ప్రసంగిస్తారు. ఆయన పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసింది.

# ఇది దుశ్శాసన సభ.. మహిళా నేతల జుట్టు పట్టుకుని ఈడ్చేస్తారా?



మొదటిపేజీ తరువాయి - అసెంబ్లీకి వెళ్లిన ప్రతిపక్ష సభ్యులపై పోలీసులు అత్యంత కిరాతకంగా వ్యవహరించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి 1000 రోజులుగా పాలన సాగిస్తోందని, దీనిపై శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తే తమపై ఉక్కుపాదం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో నిరసన తెలిపినట్లే తాము కూడా నిరసన తెలిపేందుకు యత్నించామని, తాము ఎలాంటి అన్‌పార్లమెంటరీ, నికృష్టమైన భాష మాట్లాడలేదని స్పష్టం చేశారు. గతంలో వైఎస్సార్, కిరణ్‌కుమార్ రెడ్డి కేబినెట్లలో మంత్రులుగా, మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన అత్యంత అనుభవజ్ఞురాళ్లు, సౌమ్యులైన సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిల పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు దారుణం అంటూ కేటీఆర్ తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు. "ఒకవైపు రాహుల్ గాంధీ ఢిల్లీలో 'స్మాష్ ది పాట్రియార్కీ' అంటూ మహిళా సాధికారతపై గొప్పలు చెప్తారు. కానీ ఇక్కడ రాహుల్ గాంధీ రాజకీయాల్లోకి రాకముందే మంత్రులుగా పనిచేసిన సీనియర్ మహిళా నేతల జుట్టు పట్టుకుని, గొంతు పిసికే ప్రయత్నం చేశారు" అని నిలదీశారు. పోలీసులు సునీతా లక్ష్మారెడ్డి చీర పట్టుకుని లాగుతుంటే... కోవ లక్ష్మి అడ్డుకోకపోయి ఉంటే తీవ్ర ప్రమాదం జరిగి ఉండేదని, ఈ ఘటనతో సునీతమ్మ కంటనీరు పెట్టుకోవడం చూస్తే ఇది శాసనసభలా కాకుండా దుశ్శాసన సభలా మారిందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీనియర్ నాయకురాళ్ల పట్ల జరిగిన ఈ దాడి, అనాగరిక ప్రవర్తన వెనుక స్పష్టంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్ర ఉందే తప్ప మరొకటి కాదని కేటీఆర్ ఆరోపించారు.

# నా రిటైర్మెంట్ వరకు గడువు అడుగుతారా ఏంటి?

మొదటిపేజీ తరువాయి - ఈ అభ్యర్థనను తోసిపుచ్చిన సర్వోన్నత న్యాయస్థానం, నవంబర్ 30వ తేదీలోగా తుది నివేదికను సమర్పించి తీరాలని సోమవారం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ గడువును పొడిగించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పింది. విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. కమిటీ కోరిన గడువు (2027 ఫిబ్రవరి 28) తన పదవీ విరమణ తేదీ తర్వాత ఉందని సీజేఐ చురక అంటించారు. "కమిటీ ప్రాథమికంగా నా పదవీ విరమణ వరకు వాయిదా కోరినట్లుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. అవసరమైతే రాత్రింబవళ్లు పనిచేసి గడువులోగా నివేదికను పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా నివేదిక సమర్పించడంలో విఫలమైతే, కమిటీని పునర్వ్యవస్థీకరించే అంశాన్ని పరిశీలిస్తామని ధర్మాసనం హెచ్చరించింది. కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి వాదనలు వినిపిస్తూ, మధ్యంతర నివేదిక సిద్ధంగా ఉందని తెలిపారు. రాజస్థాన్, గుజరాత్‌లోని గిరిజన సంఘాలతో సహా అన్ని వర్గాల అభిప్రాయాలను సమగ్రంగా తీసుకోవడానికి అదనపు సమయం అవసరమని కోరారు. అయితే, ఆరు నెలల గడువు పొడిగింపు అభ్యర్థనను తిరస్కరించిన కోర్టు, కేవలం రెండు నెలల సమయం మాత్రమే ఇచ్చింది. నివేదికను ఖరారు చేసే ముందు అన్ని వర్గాలతో సమర్థవంతంగా సంప్రదింపులు జరపాలని కమిటీకి సూచించింది. ఆరావళి పర్వత శ్రేణుల నిర్వచనం, సరిహద్దుల నిర్ధారణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై శాస్త్రీయంగా అధ్యయనం చేసేందుకు సుప్రీంకోర్టు ఈ ఏడాది జూన్‌లో ఐదుగురు సభ్యులతో ఈ కమిటీని ఏర్పాటు చేసింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ (ఐసీఎఫ్ఆర్ఈ) డైరెక్టర్ జనరల్ నేతృత్వంలోని ఈ కమిటీ వాస్తవానికి ఆగస్టు 31 నాటికే నివేదిక ఇవ్వాల్సి ఉంది. పర్వత శ్రేణిగా గుర్తించాలంటే కనీసం 100 మీటర్ల ఎత్తు ఉండాలన్న నిబంధన వల్ల పర్యావరణపరంగా కీలకమైన ప్రాంతాలు పరిరక్షణ చట్రం నుంచి బయటకు వెళ్లే ప్రమాదం ఉందని గతంలో సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన కమిటీ నివేదిక కీలకంగా మారింది. ఈ కేసులో తదుపరి విచారణను డిసెంబర్ 2వ తేదీకి ధర్మాసనం వాయిదా వేసింది.

# మహిళలపై అనుచితమైన వ్యాఖ్యలు సహించం

మొదటిపేజీ తరువాయి - చేస్తే మాత్రం ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అలాంటి వ్యాఖ్యలు ఎవరు చేసినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సభలో స్పష్టం చేశారు. డీఎంకేకు ఓటు వేయని ప్రజలను ఆ పార్టీ నేతలు విమర్శించడంపై ఆయన మండిపడ్డారు. ప్రజల తీర్పును గౌరవించకపోవడం వల్లే డీఎంకే నేడు ప్రతిపక్షంలో కూర్చోవాల్సి వచ్చిందని విజయ్ విమర్శించారు. అవినీతి ఆరోపణల గురించి ప్రస్తావిస్తూ, డీఎంకే బండారం మొత్తం అధికారిక రికార్డుల్లో, అసెంబ్లీ లైబ్రరీలో అందుబాటులో ఉందని విజయ్ అన్నారు. 1977 నాటి సర్కారియా కమిషన్ నివేదికను ఆయన ఉటంకించారు. వీరాణం పైప్‌లైన్ ప్రాజెక్ట్‌లో కాంట్రాక్టులు ఇచ్చేందుకు కమీషన్లు డిమాండ్ చేశారని, ఒక నిర్దిష్ట కంపెనీకి అనుకూలంగా వ్యవహరించేందుకు అప్పటి ముఖ్యమంత్రి కార్యాలయాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఈ ఆరోపణలకు సంబంధించిన పత్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అంతేగాక ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆరోపణలను కూడా విజయ్ సభ దృష్టికి తీసుకొచ్చారు. పార్టీ ఫండ్ల పేరుతో పెద్ద ఎత్తున డబ్బు వసూలు చేశారని, కొన్ని లావాదేవీలలో 7.5 నుంచి 10 శాతం వరకు కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి వి. సెంథిల్ బాలాజీ తన అధికారిక హోదాను దుర్వినియోగం చేశారని పేర్కొన్నారు. ఈ అక్రమ లావాదేవీలలో మాజీ మంత్రికి సంబంధించిన అధికారులు, వ్యక్తులు భాగస్వాములుగా ఉన్నారని విజయ్ తెలిపారు. ఈడీ ఆరోపణలకు సంబంధించి ఎంకే స్టాలిన్, ఉదయనిధి స్టాలిన్ పేర్లను కూడా ఆయన ప్రస్తావించారు. అయితే, ఇవి కేవలం ఏజెన్సీ చేసిన ఆరోపణలు మాత్రమేనని, కోర్టులో ఇంకా రుజువు కాలేదని గమనించాలి. డీఎంకే అవినీతికి సంబంధించిన రికార్డులు చాలా ఉన్నాయని, అవన్నీ చదవాలంటే దాదాపు రెండు రోజులు పడుతుందని, అందుకే సభలో కేవలం సారాంశాన్ని మాత్రమే ప్రస్తావిస్తున్నానని విజయ్ చెప్పారు. ఇప్పటికే బహిరంగ రికార్డుల్లో ఉన్న ఆధారాల కోసం డిమాండ్ చేయడం మాని, తమపై వచ్చిన ఆరోపణలకు సమాధానం చెప్పాలని డీఎంకేకు సవాల్ విసిరారు. తాను పదవి కోసమో, అధికారం కోసమో రాజకీయాల్లోకి రాలేదని, ప్రజలకు సేవ చేయడానికే వచ్చానని స్పష్టం చేశారు. సీఎన్ అన్నాదురై, ఎంజీ రామచంద్రన్, ఎన్టీ రామారావు వంటి మహనీయుల వారసత్వాన్ని గుర్తుచేస్తూ, రాజకీయ ప్రత్యర్థులపై ప్రజల అభిమానమే అంతిమంగా గెలుస్తుందని విజయ్ విశ్వాసం

# వైసీపీది ఉగ్రవాదుల తరహా రాజకీయం

మొదటిపేజీ తరువాయి - అందించి తెలుగుతల్లికి జలహారతి పట్టడమే తన లక్ష్యమని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సాగునీటి రంగంపై తాను చేస్తున్న కృషిని గుర్తిస్తూ ప్రతిష్ఠాత్మక 'ఎకనామిక్ టైమ్స్' పత్రిక తనను 'వాటర్ మ్యాన్'గా అభివర్ణించడం సంతోషంగా ఉందని అన్నారు. అమరావతిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల 'లీడర్‌షిప్ కాన్‌క్లేవ్'లో ఆయన పార్టీ నేతలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా సాగునీటి రంగంపై చంద్రబాబు చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అభినందన తీర్మానం ప్రవేశపెట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐటీతో యువతకు ఉపాధి కల్పించిన చంద్రబాబు, ఇప్పుడు జల సంరక్షణతో 'వాటర్ మ్యాన్'గా మారారని కొనియాడారు. పట్టిసీమ, హంద్రీనీవా, వెలిగొండ, పోలవరం వంటి ప్రాజెక్టుల ద్వారా రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి సీఎం బాటలు వేస్తున్నారని ఎకనామిక్ టైమ్స్ కథనాన్ని ఆయన ఉటంకించారు. వచ్చే మూడేళ్లలో రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులను పూర్తి చేసే లక్ష్యాన్ని కూడా ఆ పత్రిక ప్రశంసించిందని తెలిపారు. ఈ ప్రశంసల నేపథ్యంలో పార్టీ నేతలంతా ఏకతాటిపై నిలబడి చంద్రబాబుకు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చి అభినందనలు తెలిపారు.

**కార్యకర్తలే పార్టీకి బలం.. కూటమి ఐక్యత ముఖ్యం**

పొలిటికల్ గవర్నెన్స్‌కు ప్రాధాన్యత ఇస్తూ పాలనలో ముందుకు సాగుతున్నామని చంద్రబాబు తెలిపారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన కార్యకర్తలకు పూర్తి గౌరవం ఇస్తామని, అనంతపురం జిల్లాకు చెందిన దళవాయి రమాదేవికి పదవి ఇవ్వడమే దీనికి నిదర్శనమని అన్నారు. క్షేత్రస్థాయిలో సమర్థంగా పనిచేసే వారికే పార్టీలో, చట్టసభల్లో అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. "పార్టీ బలోపేతం ఎంత ముఖ్యమో, కూటమి ఐక్యత కూడా అంతే ముఖ్యం. ఫ్లెక్సీలు, ఫోటోల కోసం వివాదాలకు తావివ్వకుండా కలిసికట్టుగా పనిచేయాలి. 2024 కంటే 2029లో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలి," అని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

**గత పాలనపై విమర్శలు.. ఫ్యాక్ట్‌తో కౌంటర్ ఇవ్వండి**

గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని వెంటిలేటర్‌పై పెట్టి, వ్యవస్థలను విధ్వంసం చేసిందని చంద్రబాబు విమర్శించారు. పాలకుడు ఎలా ఉండకూడదో చెప్పడానికి గత పాలనే ఒక కేస్ స్టడీ అని వ్యాఖ్యానించారు. "వైసీపీ ఒక గొడ్డలి పార్టీ. ఉగ్రవాదుల తరహాలో హిట్-రన్-హైడ్ అనే విధానంతో రాజకీయాలు చేస్తోంది. వారి ఫేక్ ప్రచారాన్ని తేలిగ్గా తీసుకోవద్దు. ప్రతి ఆరోపణను వాస్తవాలతో (ఫ్యాక్ట్) గట్టిగా తిప్పికొట్టాలి. సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటూ ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి," అని నేతలకు దిశానిర్దేశం చేశారు. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ విషయంలో వైసీపీ వక్రీకరణలకు పాల్పడుతోందని, వాటిని ఎండగట్టాలని సూచించారు.

**అభివృద్ధి, సంక్షేమంలో దూకుడు**

కేంద్ర సహకారంతో అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తున్నామని చంద్రబాబు వివరించారు. నెలకు రూ.73 వేల కోట్లతో 63 లక్షల మందికి పైగా పెన్షన్లు అందిస్తున్నామని, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, అన్న క్యాంటీన్లు వంటి పథకాలను పునరుద్ధరించామని తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా నియామకాలు చేపట్టామని, మూడు ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామని అన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు, రాయలసీమలో పరిశ్రమలు, అమరావతిలో క్వాంటం టెక్నాలజీ హబ్ ఏర్పాటుతో రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి దిశగా నడిపిస్తున్నామని వివరించారు. రాజముద్ర, బ్లాక్‌చెయిన్ టెక్నాలజీతో భూములకు భద్రత కల్పిస్తూ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరిస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు.

# కార్యకర్తలే పార్టీకి బలం వారిని ఉన్నతస్థాయికి తీసుకురండి

మొదటిపేజీ తరువాయి - చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేలు, నేతలకు కీలక దిశానిర్దేశం చేశారు. కార్యకర్తల రాజకీయ, ఆర్థిక సాధికారతకు కృషి చేయాలని, అదే సమయంలో స్వర్ణాంధ్ర విజన్-2047ను క్షేత్రస్థాయిలో అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని స్పష్టం చేశారు. కార్యకర్త బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుందని, వారిని నిరాశకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలదేనని ఆయన ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "టీడీపీ కార్యకర్త హుషారుగా ఉంటే గెలుపును ఎవరూ ఆపలేరు. కార్యకర్తల్లో చాలా మంది పేదవారు ఉన్నారు. ప్రభుత్వ పథకాల ఫలాలు వారికి అందేలా చూడాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బాగా పనిచేసిన వారికి, అక్కడి పరిస్థితులను బట్టి టికెట్లు కేటాయిస్తాం. వారు వ్యాపారాలు చేసుకుని అభివృద్ధి చెందేలా ఎమ్మెల్యేలు ప్రోత్సాహం, మార్గనిర్దేశం అందించాలి. ప్రజలు మెచ్చే విధంగా కార్యకర్తలకు న్యాయం చేస్తాం" అని హామీ ఇచ్చారు. జిల్లాల్లో, నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే బాధ్యతను మంత్రులు తీసుకోవాలని, లేనిపక్షంలో వారే జవాబుదారీగా ఉండాల్సి వస్తుందని హెచ్చరించారు.

**విజన్-2047తో నియోజకవర్గాల అభివృద్ధి**

స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్‌పై సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన విజన్‌కు నియోజకవర్గాల స్థాయిలో ఎమ్మెల్యేలు తమ ఆలోచనలతో విలువ జోడించాలని (వాల్యూ ఎడిషన్) సూచించారు. "విజన్ ప్లాన్ అమలు చేస్తే అభివృద్ధి సాధ్యమవడమే కాదు, ఎన్నికల్లోనూ గెలుపు ఖాయం. పేద-ధనిక మధ్య అంతరాలు తగ్గించడమే ఈ విజన్ ప్రధాన లక్ష్యం. ఆర్థిక కష్టాలు ఉన్నప్పటికీ, ప్రతి నియోజకవర్గానికి రూ.1 కోటి చొప్పున కేటాయించాలని నిర్ణయించాం" అని తెలిపారు. కేంద్ర మంత్రులుగా ఉన్నవారు జాతీయ స్థాయిలో శాఖలను పర్యవేక్షిస్తున్న స్ఫూర్తితోనే తమ జిల్లాలను అభివృద్ధి చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధుల్లో ఉన్నత విద్యావంతులు, రిటైర్డ్ ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు ఉన్నారని, వారంతా తమ అనుభవంతో విజన్ డాక్యుమెంట్లను అధ్యయనం చేసి, వినూత్నంగా ఆలోచించాలని కోరారు. "వందేళ్లలో జరిగే పనులను పదేళ్లలో పూర్తి చేసే టెక్నాలజీ ఇప్పుడు అందుబాటులో ఉంది. ప్రతి ఎమ్మెల్యే అకుంఠిత దీక్షతో పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చు" అని చంద్రబాబు అన్నారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు 28 కొత్త పాలసీలు తీసుకొచ్చినట్లు ఆయన గుర్తుచేశారు.

# మహిళా ఎమ్మెల్యే చీర లాగిన వాళ్లను వదిలిపెట్టం



మొదటిపేజీ తరువాయి - వేళ తమ పార్టీ ప్రజాప్రతినిధులపై పోలీసులు అత్యంత దురుసుగా వ్యవహరించారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ సభ్యులు ఎవరూ సభలోకి అడుగుపెట్టకుండా అడ్డుకోవాలనే కుట్రతోనే రేవంత్ ప్రభుత్వం ఈ రకమైన అణచివేత చర్యలకు ఒడిగట్టిందని మండిపడ్డారు. ప్రతిపక్షం లేని సభను నడిపించుకోవాలని చూస్తున్నారని ధ్వజమెత్తిన ఆయన... అసెంబ్లీ వద్ద చోటుచేసుకున్న ఉద్రిక్తతలపై మీడియాతో మాట్లాడుతూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు నిరసన టీషర్టులు ధరించి పార్లమెంట్‌కు వెళ్లినప్పుడు లేని తప్పు, మేం అసెంబ్లీకి నల్ల టీషర్టులతో వస్తే తప్పవుతుందా? నల్ల టీషర్టులపై ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడగడం నేరమా? ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతిపక్షాలకు లేదా?" అని హరీశ్‌రావు నిలదీశారు. తెలంగాణ శాసనసభ చరిత్రలో ఈరోజు ఒక చీకటి రోజుగా మిగిలిపోతుందని, ఇది అసలైన శాసనసభలా కాకుండా కౌరవసభలా మారిందని తీవ్రస్థాయిలో అభివర్ణించారు. మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి చీర లాగి, సబితా ఇంద్రారెడ్డి గొంతు నొక్కిన పోలీస్ అధికారులను, అలాగే మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని కిందపడేసి హింసించిన ఖాకీలను సప్తసముద్రాల అవతల ఉన్నా వదిలేది లేదని తీవ్రంగా హెచ్చరించారు. ఆందోళనలో కేటీఆర్ చేయి, ముఖంపై గాయాలయ్యాయని, కనీసం ఆసుపత్రికి కూడా తరలించకుండా అడ్డుకోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులపై జరిగిన ఈ దాడులు, అక్రమ అరెస్టులన్నింటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

# తెలంగాణలో కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర



మొదటిపేజీ తరువాయి - ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యతిరేక ఓటర్లను గుర్తించేందుకు బీజేపీ ప్రత్యేక ఏజెన్సీలను ఏర్పాటు చేసిందని విమర్శించారు. 2009 నుంచి ఓటింగ్ సరళిని పరిశీలించి బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. రవీంద్రభారతిలో నేడు రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. నరేంద్ర మోదీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవస్థ మొత్తం సిద్ధమవుతోందని అన్నారు. అందుకే ఎస్ఐఆర్ పేరుతో కొత్త కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. తెలంగాణలో కోటి ఓట్లు తొలగిస్తున్నా బీఆర్ఎస్ స్పందించడం లేదని మండిపడ్డారు.

**కొడంగల్‌లో 81 వేల ఓట్లు**

తన నియోజకవర్గం కొడంగల్‌లో వలస వెళ్లిన వేలాది మంది పేదల ఓట్లను తొలగిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కొడంగల్‌లో 81 వేల ఓట్లను అనామలీస్ జాబితాలో చేర్చారని తెలిపారు. ప్రస్తుత ఓట్లతోనే 2029లో మోదీ ఓటమికి పునాది పడుతుందని అన్నారు. బీజేపీ వ్యతిరేక ఓట్లు అంటే మైనార్టీలవే అనుకోవద్దని సీఎం చెప్పారు. పేదలు, గిరిజనుల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. జాతీయ స్థాయిలో లౌకిక శక్తులు ఏకమై మోదీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

**సారంపల్లి సేవలు చిరస్మరణీయం**

రైతుల కోసం జీవితాన్ని అంకితం చేసిన సారంపల్లి మల్లారెడ్డి మరణం రైతాంగానికి తీరని లోటని సీఎం అన్నారు. రైతు సమస్యలపై అవగాహన ఉన్న నాయకత్వం క్రమంగా తగ్గుతోందని పేర్కొన్నారు. కౌలు రైతులు, గిట్టుబాటు ధరలు సహా అనేక రైతు సమస్యలపై సారంపల్లికి అపారమైన అవగాహన ఉందని కొనియాడారు. కమ్యూనిస్టు ఉద్యమాల పోరాటాల వల్లే కాంగ్రెస్ పలు చట్టాలు తీసుకొచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు. కార్మికులు, పేదల సమస్యలపై కమ్యూనిస్టులు చేసిన పోరాటాలు తమ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడ్డాయని చెప్పారు.

## బూర్గంపహాడ్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం



**బూర్గంపాడు సెప్టెంబర్ 8 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు** : బూర్గంపహాడ్ మండల కేంద్రంలో మంగళవారం నాడుమండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూలపెల్లి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ తాతా మధు దళిత బిడ్డ అసెంబ్లీ స్పీకర్ శ్రీ గడ్డంప్రసాద్ పైన దుర్భాషలాడుతూ ప్రవర్తించిన తీరుకు నిరసనగా భారీ ఎత్తున కాంగ్రెస్ కుటుంబ శ్రేణులు బూర్గంపహాడ్ లో నిరసన ర్యాలీ నిర్వహించి పెద్ద ఎత్తున ఆందోళన చేశారు ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు పూలపెల్లి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దళితులు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడిన బూతు పురాణం యావత్ దళితులను అవమానించడమేనని ఆయన్ను వెంటనే భర్తరఫ్ చేయాలని,ఆయన్ను శిక్షించాలని, బిఆర్ఎస్ పార్టీ దళిత వ్యతిరేక పార్టీ అని కెసిఆర్ అసెంబ్లీకి రావటం లేదని ఆయన వెంటనే రాజీనామా చేయాలని, అసెంబ్లీ సమావేశం ప్రారంభంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు బట్టలిప్పి అసెంబ్లీ లోపలికి వచ్చే తీరు, పోలీసులపై బూతు మాటలు మాట్లాడే విధానాన్ని వారు తప్పు పట్టారు ఈ కార్యక్రమంలో బూర్గంపహాడ్ మాజీ జెడ్పిటిసి బట్టావిజయ గాంధీ, జిల్లా లీగల్ సెల్ అడ్వైజర్ భజన సతీష్ కుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి వారాల వేణు, బూర్గంపహాడ్ సర్పంచ్ మందా నాగరాజు, , దిశా కమిటీ మెంబర్ బానోత్ మురళీకృష్ణ పినపాక నియోజకవర్గఎస్సీ సెల్ ఇంచార్జ్ కొట్టే అనిల్ కుమార్, మహిళా నాయకురాలు ఆవుల వెంకటరమణమ్మ తదితరులు ర్యాలీ మరియునిరసన దీక్షలో పాల్గొన్నారు

## లోక్ అదాలత్ కి న్యాయవాదులు సహకరించాలి

సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్




**పోరు తెలంగాణ ప్రతినిధి// మెట్ పల్లి** : ఈ నెల 12 వ తేదిన నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్ కి న్యాయవాదులు సహకరించాలని మెట్ పల్లి సీనియర్ సివిల్ జడ్జి ఆర్. అజయ్ కుమార్ విజ్ఞప్తి చేసారు. మండల్ లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశం లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇరు పార్టీలకు చెందిన న్యాయవాదులు కౌన్సిలింగ్ ఇవ్వడం ద్వారా పార్టీల మనసు మారి, రాజీ కుదుర్చుకునే అవకాశాలు పెరుగుతాయాని అన్నారు. కోర్టులో పెండెన్సీ కేసులు తగ్గించడానికి న్యాయవాదుల పాత్ర మరియు సహకారం కీలకం అని అన్నారు. ఈ సమావేశంలో సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ దయ్య రాజారాం, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి రాంరెడ్డి, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెర్లపల్లి ఆనంద్ గౌడ్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ అబ్దుల్ హఫీజ్, న్యాయవాదులు మెడి చెల్మల సుమలత, జిల్లా వెంకటేశ్వర్లు, మగ్గిడి వెంకట నర్సయ్య, కోటగిరి వెంకటస్వామి, ఏలేటి నరేందర్ రెడ్డి, గంధ్ర ప్రవీణ్ రావు, బద్దం లక్ష్మారెడ్డి, పోలకొండ దయాకర్ వర్మ, తోగిటి రాజశేఖర్, బక్కూరి రమేష్, తునికి వేణు గోపాల్, రాంపల్లి జగన్, జేడి సుధాకర్, పసునూరి శ్రీనివాస్, గజ భీంకర్ వెంకటేష్, తులా రాజేందర్, అలాల శంకర్, గోపి, అశోక్, సంజయ్, రజిత ఉన్నారు.

## సర్ నోటీసులు అందిన వారు సరైన ధ్రువపత్రాలు అందజేయాలి





**పోరు తెలంగాణ మంచిర్యాల సెప్టెంబర్ 8** : జైపూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీపతి బాపు రావు జైపూర్ మండలంలోని వేలాల, పౌనూర్ గ్రామపంచాయతీని సందర్శించడం జరిగింది. గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న సర్ హియరింగ్ సభకు హాజరై గ్రామ ప్రజలకు సర్ నమోదు ప్రక్రియ పై అవగాహన కలిగించి, ఎవరిదైనా పేర్లు ఓటర్ లిస్ట్ నందు నమోదు కానిచో లేదా ఏమైనా తప్పులు ఉన్నట్లయితే సరిదిద్దుకొనుటకు అవకాశం కలదని,నోటీస్ అందిన వారు సంబంధిత డాక్యుమెంట్ సమర్పించాలని సూచించడం జరిగింది. అనంతరం మొబైల్ యాప్ ఇన్స్పెక్షన్ లో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహణను పరిశీలించి రికార్డులు తనిఖీ చేయడం జరిగింది. ఈ పర్యటనలో ఎంపిడిఓ వెంట సర్పంచ్ దేగ స్వప్న, వేముల సుధా, పంచాయతీ కార్యదర్శిలు సృజన సాగె రాకేష్, భాస్కర్, హౌసింగ్ ఏ ఈ ఖంక్ష,జీపీవో భారతీ, బి ఎల్ ఓ లు రాణి లంబు విజయలక్ష్మి, అగ్గిమెట్ల నిర్మల, లక్ష్మి, పద్మ, వార్డ్ మెంబెర్లు, గ్రామ ప్రజలు ఉన్నారు.

## ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పై ఫిర్యాదు

**మహేశ్వరం, సెప్టెంబర్ 8, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి** : మాజీ సీఎం బీఆర్ఎస్ పార్టీ అధినేత కె. చంద్రశేఖర్ రావు పై షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కెసిఆర్ మరణాన్ని కోరడాన్ని నిరసిస్తూ మంగళవారం మహేశ్వరం పోలీస్ స్టేషన్ లో సిఐ రాఘవేందర్ రెడ్డి కి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పై రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. సమగ్ర విచారణ జరిపించి ఎమ్మెల్యే శంకర్ పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఆదిల్ అలీ, సహకార బ్యాంక్ డైరెక్టర్ కాడమోని ప్రభాకర్, యూత్ అధ్యక్షుడు సిద్ధార్థ్ ఉన్నారు.




## భీమారం లో బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్




**పోరు తెలంగాణ, మంచిర్యాల, సెప్టెంబర్ 8** : భీమారం మండలంలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు కలగూర రాజకుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ 1000 రోజుల పాలనలో అమలు కానీ హామీలు ఇచ్చి ప్రజలకు పథకాలు ఇవ్వకుండా, నిరసన తెలిపిన మా ఎమ్మెల్యేలను అక్రమంగా అరెస్టు చేసిందని తెలిపారు. తమ ఎమ్మెల్యే ల అక్రమ అరెస్టుకు నిరసన తెలపడానికి వెళ్తున్న వారిని ముందస్తు అరెస్టు చేయడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వంపై తమ పోరాటం కొనసాగుతుందని తెలియజేశాడు.

## మహిళా ఎమ్మెల్యేల పై దాడి సిగ్గు సిగ్గు

తెలంగాణ మహిళలకు సీఎం
రేవంత్ రెడ్డి క్షమాపణలు చెప్పాలి..
సబితా ఇంద్రారెడ్డి పై దాడిని నిరసిస్తూ మహేశ్వరంలో
కథం తొక్కిన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు..
బాధ్యులపై చర్యలు తీసుకోవాలి..
నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ..
ఉపాధ్యక్షుడు లక్ష్మీనరసింహారెడ్డి..





**మహేశ్వరం, సెప్టెంబర్ 8, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** అసెంబ్లీలో మహిళా ఎమ్మెల్యేల పైన దాడి హేయమైన చర్య అని నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, నియోజకవర్గం ఉపాధ్యక్షుడు లక్ష్మీ నరసింహ రెడ్డి అన్నారు. మంగళవారం అసెంబ్లీ వద్ద ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఇతర ఎమ్మెల్యేల పైన కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన దమన కాండను నిరసిస్తూ మహేశ్వరం మండల కేంద్రంలో నియోజకవర్గం స్థాయి ధర్నాను చేపట్టి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రోజు రోజుకు ప్రజలలో విశ్వాసం కోల్పోతుంది అన్నారు. మాజీ మంత్రులు, మహిళా ఎమ్మెల్యేలపై, ప్రభుత్వం పాశవిక దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ప్రజా పాలనలో సీఎం రేవంత్ రెడ్డి ప్రజలను మోసం చేయడం జరుగుతుందని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలను, మహిళా ఎమ్మెల్యేలను కించపరిచే విధంగా వ్యవహరించడం జరుగుతుందని తెలిపారు. ప్రజా జీవితంలో మహిళల గౌరవానికి బంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని హెచ్చరించారు. ఇది ఒక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కే కాకుండా తెలంగాణ రాష్ట్ర మహిళలకు వర్తిస్తుందని తెలిపారు. అసెంబ్లీలో జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి చట్టపరంగా తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజా పాలన కాకుండా రాక్షస పాలన కొనసాగుతుందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో నిజాం పాలనను తలపిస్తున్నదని తెలిపారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అసెంబ్లీ సాక్షిగా నిరసనకు దిగితే ఎమ్మెల్యేల పైన దాడులు చేయడం ఏమిటి అని ప్రశ్నించారు. వెయ్యి రోజుల పాలనలో సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణను అధోగతి పాలు చేశారని మండిపడ్డారు. ఈ నిరసన కార్యక్రమంలో నియోజకవర్గం మహిళలు సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం పై తీవ్రస్థాయిలో దుమ్మెత్తి పోశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం నాయకులు హనుమగల్ల చంద్రయ్య, సహకార బ్యాంక్ చైర్మన్ మంచె పాండు యాదవ్, వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి, నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఆంగోతు రాజు నాయక్, జెల్లల లక్ష్మయ్య, రామిడి రామిరెడ్డి, అర్కల కామేశ్వర్ రెడ్డి, పెండ్యాల నగేష్ నాయకులు కరోల్ల చంద్రయ్య ముదిరాజ్, సుధాకర్ రెడ్డి, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఆదిల్అలీ, డైరెక్టర్లు కాడమోని ప్రభాకర్, పోల్కం బాలయ్య, సర్పంచులు మునగపాటి నవీన్, కాట్రావత్ భామిని దేవుల నాయక్, జెన్నపల్లి పద్మ, సభావత్ మంజుల చత్రు నాయక్,జె. సుజాత నాయకులు వెంకట్ రెడ్డి, సప్పిడి రాజు, ఉప్పు నూతల శ్రీనివాస్, మాజీ ఖిల్లా మైసమ్మ చైర్మన్ జి.శ్రీనివాస్, నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ మహిళలు సుశీల రెడ్డి, లలిత జగన్, గీతారవి, మాధవి పతంగి, సునీత బాలరాజ్, స్వప్న జంగారెడ్డి, దీపికాశేఖర్ రెడ్డి, ముత్యాల కృష్ణ లలిత నియోజకవర్గం మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి కదలికలు



**కొత్తగూడెం సెప్టెంబర్ 8 పోరు తెలంగాణ జిల్లా ప్రజలకు దాసు** : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి స్థల ఎంపిక ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. గతంలో పరిశీలించిన రెండు ప్రాంతాలు సాంకేతిక కారణాలతో అనుకూలం కాదని తేలడంతో.. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రతిపాదించిన ఆరు ప్రత్యామ్నాయ ప్రాంతాలపై కేంద్ర సాంకేతిక బృందం, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) అధికారులు సోమవారం నాడు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. సుజాతనగర్ మండలం సీతంపేట, లక్ష్మీదేవి పల్లి మండలం గరీబ్ పేట, అన్నపురెడ్డిపల్లి మండలం అబ్బుగూడెం ప్రాంతాల్లో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి ప్రత్యేక చొరవతో అధికారులతో కలిసి పర్యటించి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. బురద డొంకల మీదుగా కాలినడకన వెళ్లి, కొండ ప్రాంతాల్లో తిరుగుతూ అటవీ ప్రాంతాల్లోకి ముందుకుసాగారు. ఆయా ప్రాంతాల భౌగోళిక పరిస్థితులు, రన్‌వే నిర్మాణానికి ఉన్న అవకాశాలు, విమానాల రాకపోకలకు అనువుగా ఉంటాయా? తదితర అంశాలను అధికారులు అంచనా వేశారు.

**సాంకేతిక అంశాలపై అంచనా..**

ప్రతిపాదిత ప్రాంతాల్లో విమానాల ల్యాండింగ్, టేకాఫ్‌కు అనువైన పరిస్థితులు, భౌగోళిక స్వరూపం, వాతావరణ పరిస్థితులు, రన్‌వే నిర్మాణానికి అవసరమైన సాంకేతిక అంశాలను కేంద్ర బృందం పరిశీలిస్తోంది. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం సాంకేతిక నివేదికను రూపొందించనుంది. ఆ నివేదిక ఆధారంగా విమానాశ్రయానికి అనువైన ప్రాంతాన్ని ఖరారు చేసే అవకాశం ఉంది.

**దుమ్ముగూడెం, పాల్వంచ మండలాల్లో పరిశీలన**

కేంద్ర బృందం మంగళవారం దుమ్ముగూడెం, పాల్వంచ మండలాల్లో ప్రతిపాదిత స్థలాలను పరిశీలించనుంది. అన్ని ప్రాంతాల క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయిన అనంతరం విమానాశ్రయానికి అనువైన ప్రాంతాన్ని ఎంపిక చేయనున్నట్లు తెలుస్తోంది. దీంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ ఏర్పాటుపై ఆశలు మరింత బలపడ్డాయి.

## పెద్దమ్మతల్లి దేవాలయానికి ఎల్ఈడి స్క్రీన్ బోర్డు వితరణ

బహుకరణ చిట్ల శ్రీనివాస్ ముదిరాజ్



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి** : పెద్దపల్లి జిల్లా సెప్టెంబర్ 8 ఓదెల మండలంలోని ఉప్పరపల్లె గ్రామంలో ముదిరాజుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మతల్లి దేవాలయానికి గూడెం గ్రామానికి చెందిన జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం డైరెక్టర్ చిట్ల శ్రీనివాస్ ముదిరాజ్ ఎల్ఈడి స్క్రీన్ బోర్డు ను బహుకరించారు ఈ సందర్భంగా శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ ఉప్పరపల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లి బోనాల సందర్భంగా ఎల్ఈడి స్క్రీన్ బోర్డ్ అందించడం చాలా సంతోషంగా ఉందని పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో అందరూ ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో సంతోషంగా ఉండాలని ఆ తల్లి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని అన్నారు ఈ సందర్భంగా గ్రామ ముదిరాజు అధ్యక్షులు పాలకవర్గం కృతజ్ఞతలు తెలిపి చిట్ల శ్రీనివాస్ ముదిరాజ్ ను శాలువాతో ఘనంగా సన్మానం చేసి అమ్మవారి తీర్థ ప్రసాదములు అందించారు ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ పెద్దమ్మ తల్లి ఆలయానికి పెద్ద మనసుతో ఎల్ఈడి స్క్రీన్ బోర్డు అందించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ఉపాధ్యక్షులు డైరెక్టర్లు తోపాటు ముదిరాజ్ సంఘం కుల బాంధవులు తదితరులు పాల్గొన్నారు

## రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీ ఐడి తప్పనిసరి

మండల వ్యవసాయ అధికారి లావణ్య వెల్లడి



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్)** : భూమి పట్టా కలిగిన ప్రతి ఒక్క రైతు కూడా ఫార్మర్ రిజిస్ట్రీ ఐడి తప్పనిసరిగా కలిగి ఉండాలని బాల్కొండ మండల వ్యవసాయ అధికారి లావణ్య సూచించారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు డిజిటల్ అగ్రి మిషన్ పథకంలో భాగంగా వ్యవసాయ రంగాన్ని డిజిటలీకరణ చేయడంలో భాగంగా ప్రతి ఒక్క రైతుకు ఆధార్,పట్టా వివరాలను అనుసంధానం చేయడం ద్వారా రైతులకు రైతు గుర్తింపు కార్డుల మంజూరి ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్టుగా తెలిపారు.భవిష్యత్తులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే వివిధ రైతు సంక్షేమ పథకాలకు ఈ ఫార్మర్ రిజిస్ట్రీ కీలకంగా మారనుందని తెలిపారు.ప్రతి ఒక్క రైతు కూడా విధిగా తమ పట్టా పాస్ బుక్,ఆధార్ కార్డులతో సమీప మీసేవ కేంద్రాలలో కానీ,సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి కానీ తప్పని సరిగా రైతు గుర్తింపు కార్డులు చేయించుకోవాలని సూచించారు.

## ఉచిత వైద్య శిబిరం

సర్పంచ్ పిట్టల రవికుమార్ ఆధ్వర్యంలో






**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి** : పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పిట్టల ఎల్లయ్య పల్లె గ్రామంలో మంగళవారం మెడికవర్ హాస్పిటల్ కరీంనగర్ వారి చే ఉచితంగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పిట్టల రవికుమార్. వైద్య శిబిరంలో స్థానిక ప్రజలు 87 మంది కి పైగా వైద్య శిబిరంలో ఉచితంగా అన్ని రకాల పరీక్షలు, చేయించుకొని రోగులకు డాక్టర్లు ఉచితంగా మందులు పంపిణీ చేశారు . ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని స్థానికులు అందరూ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అమూల్య వార్డ్ సభ్యులు కందుల అనిత పిట్టల శారద హాస్పిటల్ డాక్టర్ రాకేష్ వారి సిబ్బంది గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## ఎల్లమ్మ హుండీ లెక్కింపు






**పోరు తెలంగాణ ప్రతినిధి// మెట్ పల్లి** : దేవాదాయ ధర్మాదాయ శాఖ వెల్లుల్ల గ్రామము మెట్పల్లి మండలం జగిత్యాల జిల్లా శ్రీ ఎల్లమ్మ దేవాలయం లో దేవాదాయ శాఖ వారి ఆధీనంలో తేదీ. 08-09-2026 ఈరోజు వివిధ సేవ టికెట్స్ ద్వారా వచ్చిన ఆదాయము 19666=00( అక్షరాల పందొమ్మిది వేయిల అరు వందల అరువై ఆరు రూపాయలు వచ్చినది మరియు ఈరోజు అమ్మవారి హుండీలు విప్పి లెక్కించగా వచ్చిన ఆదాయము 8364=00(అక్షరాల ఎనిమిది వేయిల ముదూవందల అరువైయి నాలుగు రూపాయలు )వచ్చినది మొత్తము ఆదాయము 171030=00 ( అక్షరాల పదీహేడు వేయిల ఒక వంద ముప్పై రూపాయలు వచ్చినది మరియు వివిధ బహిరంగ వేలంలో నిర్వహించగా 1) కొబ్బరికాయలు పూజ సామాగ్రి ద్వారా 36000/- వేయిలు 2) దైబజార్ ద్వారా 114000/- 3) ఐస్ క్రీమ్ ద్వారా 40000/- 4) తల్లి ఆరాధన ద్వారా 79000/- మొత్తము 269000=00 (అక్షరాల రేడు లక్ష ల ఆరువేయ్ తొమ్మిది వేయిల రూపాయలు వచ్చినది ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ జగిత్యాల డివిజన్ పరిశీలకులు ఎం రాజా మొగిలి వివిధ ఆలయాల దేవాదాయ శాఖ డిప్యూటేషన్ స్టాఫ్ కల్వకుంట్ల అనిల్ రావు కూకట్ల రాజేందర్ గుంటుక శివ కేశవ్ మృత లక్ష్మి వెల్లుల్ల గ్రామ సర్పంచ్ గూడూరు తిరుపతి అని రెడ్డి రాజేందర్ భక్తులు పాల్గొన్నారు మరియు మెట్పల్లి పోలీస్ శాఖ వారు భక్తులకు ప్రయాణికులకు ట్రాఫిక్ సమస్య రాకుండా పర్యవేక్షణ చేసినారు అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవడం కోసం అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు భక్తులకు ఏలాంటి ఇబ్బంది లేకుండా దేవాలయం నిర్వాహణ చేయనైనది అని దేవాలయ కార్యనిర్వహణ అధికారి కే.కాంత రెడ్డి తెలిపినారు.

## గణేష్ నిమజ్జన కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ నితికా పంత్



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 08: కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి** : కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా గణపతి నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేందుకు జిల్లా పోలీస్ శాఖ ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆసిఫాబాద్ పెద్దవాగు, కాగజ్‌నగర్ పెద్దవాగు నిమజ్జన కేంద్రాలను సందర్శించి, గణేష్ మండపాల నుంచి నిమజ్జన కేంద్రాల వరకు ఉన్న ఊరేగింపు మార్గాలను పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, బారికేడింగ్ అంశాలపై పోలీస్ అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. నిమజ్జన ప్రాంతాల్లో బారికేడింగ్, రోప్ బ్యారియర్లు, లైటింగ్ ఏర్పాటు చేయాలని, వాహనాలకు ప్రత్యేక రూట్ మ్యాప్, పార్కింగ్ స్థలాలు కేటాయించాలని ఆదేశించారు. భారీగా జనం గుమిగూడే చోట్ల క్రౌడ్ మేనేజ్‌మెంట్, నిరంతర పోలీస్ పర్యవేక్షణతో పాటు సిసిటివి, డ్రోన్ నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. నీటి వనరుల వద్ద ప్రమాదకర ప్రాంతాలకు బారికేడింగ్, నిమజ్జనానికి ఉపయోగించే క్రేన్లు, యంత్రాల భద్రతపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. వైద్య, అగ్నిమాపక, రక్షణ బృందాలతో సమన్వయం చేసుకోవాలని, అత్యవసర పరిస్థితుల కోసం క్విక్ రెస్పాన్స్ టీమ్‌లను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. మహిళలు, పిల్లలు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పిల్లలు లేదా కుటుంబ సభ్యులు తప్పిపోతే వెంటనే సహాయం అందించేందుకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని సూచించారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. ప్రజలు పోలీస్ సూచనలు పాటిస్తూ, ప్రమాదకర ప్రాంతాలకు దూరంగా ఉండి, పిల్లలను జాగ్రత్తగా చూసుకుంటూ, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.

# నేత్రదాన అవగాహన కరపత్రాలు ఆవిష్కరించిన సీఐ రంజిత్ రావు



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి** : పెద్దపెల్లి జిల్లా ఓదెల 41 వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పోత్కపల్లి పోలీస్ స్టేషన్ లో సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి డాక్టర్ మేర్గు భీష్మాచారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఓదెలలో అత్యధికంగా 280 నేత్రదానాలు 5 అవయవ దానాలు 4 శరీర దానాలు చేసి ఆదర్శంగా నిలిచారని అతిథులు పేర్కొన్నారు ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా హాజరైన సిఐ రంజిత్ రావు ఎస్సై సనత్ రెడ్డిల నేత్రదాన అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు ఈ సందర్భంగా సి.ఐ రంజిత్ రావు స్వయంగా నేత్రదానానికి అంగీకరిస్తూ సంబంధిత విల్ ఫామ్ (సంకల్ప పత్రం) నిర్వాహకులకు అందజేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు అనంతరం సిఐ రంజిత్ రావు మాట్లాడుతూ మరణానంతరం నేత్రాలను దానం చేయడం ద్వారా మరొకరికి చూపునిచ్చి వారి జీవితాల్లో వెలుగులు నింపవచ్చని పేర్కొన్నారు నేత్రదానంపై సమాజంలో విస్తృత అవగాహన కలగాలని కోరారు ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్ ఫౌండేషన్ టీం సభ్యులు క్యాతం మల్లేశం, డాక్టర్ ఇప్పనపల్లి వెంకటేశ్వర్లు డాక్టర్ కొండ్ర వేణు , మెరుగు సారంగం తదితరులు ఉన్నారు

# ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ని విమర్శించే స్థాయి నీది కాదు

**బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు చేసిందేమిటో**

**ముందుగా కుర్రి నాగేశ్వరరావు సమాధానం చెప్పాలి**

**మణుగూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు పీరినాకి**

**నవీన్ కుర్రం రవి**



**మణుగూరు, సెప్టెంబర్ 7:** పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పై బీఆర్ఎస్ మండల అధ్యక్షులు కుర్రి నాగేశ్వరరావు చేసిన విమర్శలను మణుగూరు మండలపట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పీరినాకి నవీన్, కురం రవి లు తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ని కమిషన్ల అంటావా నువ్వు ఎంత ని స్థాయి ఎంత సిగ్గువుండాలి కుర్రి నాగేశ్వరరావు నీకు కొంచమైనా మానవత్వం లేకుండా అన్నం పెట్టినా వాడికి సున్నం పెట్టి కమిషన్లకు కక్కుర్తిపడింది ఎవరో మండల ప్రజలకు తెలుసు అని మండిపడ్డారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి కృషి చేస్తూ, పినపాక నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. అలాంటి ప్రజాప్రతినిధిపై విమర్శలు చేసే ముందు బీఆర్ఎస్ నాయకులు తమ పదేళ్ల పాలనలో మణుగూరు ప్రాంతానికి, పినపాక నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందని, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారని పీరినాకి నవీన్ తెలిపారు. ప్రజా సమస్యలపై మాట్లాడే ముందు బీఆర్ఎస్ నాయకులు తమ గత పాలనను ఒక్కసారి గుర్తు చేసుకోవాలని సూచించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు, చేసిన అభివృద్ధిపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత బీఆర్ఎస్ నాయకులపై ఉందన్నారు. అసెంబ్లీకి సైతం సక్రమంగా హాజరు కాకుండా ప్రజా సమస్యలపై మాట్లాడే కేసీఆర్, ఆయన పార్టీ నాయకులు ముందుగా ప్రజలకు సమాధానం చెప్పాలని పీరినాకి నవీన్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పై నిరాధార ఆరోపణలు చేస్తే కాంగ్రెస్ పార్టీ తరఫున తగిన రీతిలో సమాధానం చెప్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఎస్సి సెల్ టౌన్ అధ్యక్షులు పొడుతూరి రవి, దుగ్గంపూడి ఈశ్వర్ రెడ్డి, కోర్లకుంట అప్పారావు, వాసం శెట్టి వెంకట్రావు, ఎన్ ఎస్ యు ఈశ్వర్ నందు, తమ్మిశెట్టి శ్రీను, నానాజీ తదితరులు పాల్గొన్నారు

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

# బియ్యాన్ని త్వరగా అందించాలి







**పోరు తెలంగాణ, మంచిర్యాల,సెప్టెంబర్ 8, 2026:** రైస్ మిల్లర్లు తమకు నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా బియ్యాన్ని త్వరగా అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని భీమారం మండలం అంకుశాపూర్ గ్రామంలో గల సమతా రైస్ మిల్ ను ఆకస్మికంగా సందర్శించి రైస్ మిల్లు నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమంలో భాగంగా కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి సేకరించిన ధాన్యాన్ని సామర్థ్యానికి అనుగుణంగా రైస్ మిల్లులకు కేటాయించడం జరిగిందని, రైస్ మిల్లర్లు తమకు కేటాయించిన లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలంలోని మద్దికల్ గ్రామాన్ని సందర్శించి పారిశుధ్య నిర్వహణ తీరును పరిశీలించారు. ప్రతి రోజు తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలించాలని, మురుగు కాలువలలో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని తెలిపారు. నీటి నిల్వలు లేకుండా శుభ్రపరచాలని, పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. నిరుపేదలకు గూడు కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్లు పొందిన లబ్ధిదారులు నిబంధనల ప్రకారం 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇంటి నిర్మాణం చేపట్టి త్వరగా పూర్తి చేయాలని, నిర్దేశిత విస్తీర్ణంలో నిర్మించిన ఇండ్లకు మాత్రమే బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇండ్లు పొందిన లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేపట్టి త్వరగా పూర్తి చేసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామంలో కొంతమంది రైతులు వరి సాగు చేయడాన్ని గమనించి వారితో మాట్లాడారు. ఎల్ నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని సూచించారు. పంట సాగుకు బోర్లు, చెరువు అందుబాటులో ఉండడంతో వరి సాగు చేస్తున్నామని తెలిపారు. భూ సమస్యల పరిష్కారంలో భాగంగా చేపట్టిన రీ సర్వే ప్రక్రియలో నిర్దేశిత విధానాలను పాటించాలని, ఫీల్డ్ రిజిస్టర్, విలేజ్ రిజిస్టర్ లలో వివరాలు నమోదు చేస్తూ సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. రీ సర్వే పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆరేపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో నోటీసుల జారీ, విచారణ కార్యక్రమాల నిర్వహణను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాలలో కొనసాగుతున్న అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం తయారీలో శుభ్రత నిబంధనలు పాటించాలని సిబ్బందికి సూచించారు. 6వ తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసన సామర్థ్యాలను పరీక్షించి స్వయంగా వారికి పాఠ్యాంశాలు బోధించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు పట్టిక, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని సూచించారు. నూతనంగా నిర్మించిన భవిత కేంద్రాన్ని సందర్శించి ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాలలో మండల తహసిల్దార్ సదానందం, మండల పరిషత్ అభివృద్ధి అధికారి వీణ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధును వెంటనే బర్తరఫ్ చేయాలి

**మణుగూరులో కాంగ్రెస్ ఆధ్వర్యంలో**

**భారీ నిరసన ర్యాలీ**



**మణుగూరు, సెప్టెంబర్ 8, పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ మణుగూరులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీఅధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డిసిసి అధ్యక్షురాలు తోటా దేవి ప్రసన్న పిలుపు మేరకు, లిపినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మణుగూరు మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు. మణుగూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, జిల్లా ముఖ్య నాయకులు, రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు , యూత్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో ర్యాలీగా బయలుదేరి అంబేద్కర్ సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ స్పీకర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన అసెంబ్లీ వ్యవస్థలో స్పీకర్ పదవికి అత్యంత గౌరవం ఉందని, అటువంటి అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలను అవమానించడమేనని అన్నారు. రాజకీయ విమర్శలకు హద్దులు ఉండాలని, రాజ్యాంగబద్ధ పదవుల గౌరవాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాలని సూచించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకుని తాతా మధు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, ఎమ్మెల్సీ పదవి నుంచి తాతా మధును వెంటనే బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థను, రాజ్యాంగ పదవుల గౌరవాన్ని కించపరిచే విధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ వ్యవస్థల గౌరవాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు పీరినాకి నవీన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కురం రవి ముదిరాజ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లకు ముందస్తుగా ఏర్పాట్లు పూర్తి చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**



**పోరు తెలంగాణ, మంచిర్యాల సెప్టెంబర్ 8, 2026:** జిల్లాలో వానాకాలం 2026-27 సీజన్‌కు సంబంధించి వరి ధాన్యం కొనుగోళ్లకు ముందస్తు చర్యలు తీసుకొని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా పౌర సరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, జిల్లా మార్కెటింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వానాకాలం 2026-27లో జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన గోదాములను ముందుగానే గుర్తించి సిద్ధంగా ఉంచాలని, ధాన్యం కొనుగోళ్ల కొరకు సంబంధిత ఏజెన్సీలతో ముందస్తు సమావేశాలు నిర్వహించి, సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎట్టి పరిస్థితులలోనూ లోతట్టు ప్రాంతాలలో ఏర్పాటు చేయరాదని, ఎత్తైన ప్రాంతాలలో నీరు నిల్వ ఉండకుండా చదునుగా ఉన్న అనుకూల ప్రదేశాలను ఎంపిక చేసి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా రైతులకు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలకు తరచుగా అడిగే ప్రశ్నలుపై అవగాహన కల్పించాలని సూచించారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలు, కొనుగోలు విధానం తదితర అంశాలపై రైతులకు ముందస్తుగా అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన మౌలిక వసతులు, ఇతర అవసరమైన సదుపాయాలను ముందుగానే సమకూర్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వానాకాలం ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పై దాడి హేయమైన చర్య

**సీఎం రేవంత్ రెడ్డి మహిళా లోకానికి క్షమాపణలు చెప్పాలి..**

**న్యాయం జరిగే వరకు గ్రామ గ్రామాన నిరసనలు..**

**మాజీ కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఆదిల్ అలీ..**



**మహేశ్వరం, సెప్టెంబర్ 8, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పై కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్లు మహేశ్వరం మండల మాజీ కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఆదిల్ అలీ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర మహిళలకు క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే దాడులకు పాల్పడుతున్నారని ఆయన మండిపడ్డారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ అసెంబ్లీ సాక్షిగా నిరసనకు దిగితే సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో పోలీసు బలగాలతో ఒక మహిళ మాజీ మంత్రి, ఎమ్మెల్యే అని చూడకుండా విచక్షణ రహితంగా గొంతు పట్టుకొని దాడులు చేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడుతున్నాయని ఆయన అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నిజాం పాలనను కొనసాగిస్తున్నారని ఆయన మండి పడ్డారు. అసెంబ్లీ సాక్షిగా జరిగిన సంఘటనకు సీఎం రేవంత్ రెడ్డి పూర్తిగా బాధ్యత వహించి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న పైశాచిక దోరణి పై గ్రామ, గ్రామాన నిరసన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

# మహిళ సంఘాల గోదాం భవనాలకు స్థలం పరిశీలన



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి:సెప్టెంబర్ 08(పోరు తెలంగాణ న్యూస్:) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధి, అభ్యున్నతి కోసం వ్యవసాయ గోదాంలు మరియు మొక్కజొన్న ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు లో భాగంగా దోమకొండ మండలానికి జిల్లా అదనపు డి ఆర్ డి ఓ విజయ లక్ష్మి రావడం జరిగింది. మహిళ సంఘాల గోదాం భవనాలకు స్థలం విషయం గురించి ఎమ్మార్వో తో మాట్లాడుతూ మహిళ రైతులు పండిస్తున్న పంటలను కొనుగోలు మరియు అమ్మకాలు చేస్తున్న క్రమంలో సరియైన ధర పొందడానికి ఈ గోదాంలు ఉపయోగపడతాయి. పంటల సాగు ద్వారా వచ్చే విత్తనాలను ప్రాసెసింగ్ చేసి, ప్యాక్ చేసి మహిళా పారిశ్రామిక వేత్తలను చేయాలని ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని తెలిపారు. రెండు యూనిట్లు ఏర్పాటు చేయు స్థలాన్ని ఆర్ ఐ తో దోమకొండ లోని పలుగు గడ్డ స్థలం పరిశీలించడం జరిగింది. పనులు త్వరగా పూర్తి చేసి మహిళలకు అందుబాటులోకి తీసుకు రావాలని ఐకెపి సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సురేష్ కుమార్, ఇక్రిశాట్ కో ఆర్డినేటర్లు యశ్వంత్, ఏపీఎం శ్రీనివాస్, ఎఫ్ పీసీ సీఈఓ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన ద్వారా కుటుంబానికి ఆర్థిక భరోసా



**పోరు తెలంగాణ మంచిర్యాల సెప్టెంబర్ 8 :** తిర్యాణి గ్రామానికి చెందిన బోర్లకుంట స్వప్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, భీమారం శాఖలో ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజే బి వై ) లో పేరు నమోదు చేసుకొని ఇటీవల అనారోగ్య కారణాలతో ఆమె మరణించగా, బీమా క్లెయిమ్ ద్వారా మంజూరైన రూ.2 లక్షల బీమా చెక్కును ఆమె నామినీ అయిన పొట్లం శేరి సాయితేజ కి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భీమారం శాఖ కార్యనిర్వాహణ అధికారి జి. సుబ్బారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా -- భీమారం శాఖ కార్యనిర్వాహణ అధికారి జి. సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఖాతాదారుడు తప్పనిసరిగా బీమా పథకాలలో పేరు నమోదు చేసుకొని కుటుంబ భవిష్యత్తుకు ఆర్థిక భద్రత కల్పించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ జి. సుమంత్, సిబ్బంది బి. శంకర్, కె. సతీష్ కుమార్, పి.ఎస్.వై. తేజస్వి, ఆర్. గణకామేష్, ఖాతాదారులు పాల్గొన్నారు.

# ధర్మారం గ్రామం లో విబ్జి రామ్ జి గ్రామసభ



**పోరు తెలంగాణ మంచిర్యాల జిల్లా సెప్టెంబర్ 8 :** భీమారం మండలం, ధర్మారం గ్రామ పంచాయితీలో మంగళవారం వీబీజీ రామ్జీ ఫైనల్ గ్రామసభను సర్పంచ్ దాసరి మణిదీపక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వీబీజీ రామ్జీ చట్టం కింద గ్రామ ప్రజలకు ఉపయోగపడే వివిధ పథకాలు, వాటి ప్రయోజనాలు, అర్హతలు మరియు గ్రామస్థులకు అందే అవకాశాలపై ప్రజలకు వివరంగా అవగాహన కల్పించారు. గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దాసరి మణిదీపక్ మాట్లాడుతూ, గ్రామాభివృద్ధిలో గ్రామసభలకు ఎంతో ప్రాధాన్యత ఉందని, ప్రజలకు ఉపయోగపడే పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రజలు తమ సమస్యలు, అవసరాలను గ్రామసభ ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మండల ఏపీఓ జీనత్ , పంచాయితీ కార్యదర్శి శ్రావణ్ కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ శరత్, వార్డు సభ్యులు గ్రామ ప్రజలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా ఎమ్మెల్యేల పట్ల అసభ్య ప్రవర్తనను ఖండిస్తూ

**పటాన్‌చెరులో బి.ఆర్.ఎస్ భారీ నిరసన.**

**నిరసనలో పాల్గొన్న ఐలాపురం మాణిక్ యాదవ్.**



**పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి యువకిశోర్ పటాన్చెరు నియోజకవర్గం సెప్టెంబర్ 8 :** నిన్న అసెంబ్లీ ప్రాంగణంలో మహిళా ఎమ్మెల్యేల పట్ల చోటుచేసుకున్న అసభ్యకరమైన ప్రవర్తనను తీవ్రంగా ఖండిస్తూ, ఈరోజు పటాన్‌చెరు నియోజకవర్గంలో భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ప్రజాస్వామ్యానికి ఆలయమైన అసెంబ్లీలో మహిళా ప్రజాప్రతినిధుల పట్ల అనుచితంగా ప్రవర్తించడం ప్రజాస్వామ్య విలువలకు, మహిళల గౌరవానికి విరుద్ధం. మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత. రాజకీయ విభేదాలు ఎన్ని ఉన్నా, మహిళా ప్రజాప్రతినిధుల గౌరవానికి భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించలేం.

# క్షణికావేశంలో వివాహిత ఆత్మహత్య



**పోరు తెలంగాణ నెక్కొండ సెప్టెంబర్ 8 వరంగల్ జిల్లా నెక్కొండ మండలం :** బొల్లికొండ గ్రామానికి చెందిన అఖిల (20) కు రెండేళ్ల క్రితం మహబూబాబాద్ కు చెందిన బాణోత్ హుస్సేన్ తో వివాహం జరిగింది. వీరికి ఏడాది వయసున్న పాప ఉంది. ఇటీవల పుట్టింటికి వెళ్లిన అఖిల, సెప్టెంబర్ 2వ తేదీన పాప ఏడుస్తుండటంతో భర్తకు చూపించేందుకు వీడియో కాల్ చేసింది. భర్త స్పందించకపోవడంతో మనస్తాపానికి గురైనట్లు తెలుస్తోంసభ్య అనంతరం ఆమె మహబూబాబాద్ లోని అత్తగారింటికి వచ్చి విషపదార్థం సేవించింది. కుటుంబ సభ్యుల గమనించి వెంటనే జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

# షబ్బీర్ అలీనీ కలిసిన కాంగ్రెస్ నాయకులు



**కామారెడ్డి జిల్లా ప్రతినిధిసెప్టెంబర్ 08(పోరు తెలంగాణ న్యూస్:) :** హైదరాబాద్ లో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ నివాసంలో బీబీపేట్ మండలం మాందాపూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీనీ మర్యాద పూర్వకంగా కలిసి గగ్రామంలో పలు సమస్యల గురించి గ్రామ అభివృద్ధి కోసం చర్చించారు వారు మాట్లాడుతూ గ్రామంలో అవసరమైన సీసీ రోడ్లు, డ్రైనేజీలకు అవసరమయ్యే నిధులు మంజూరు చేయిస్తానని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలని ప్రభుత్వం అందిస్తున్న పథకాల ఫలాలు ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ పార్టీనీ మరింత బలోపేతం చేయాలని సూచించారని తెలిపారు ప్రజలకు హాస్పటల్లో ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని అని తెలిపారన్నారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాత రాజు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు అంకన్నగారి నాగరాజ్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చింతర్ల మోహన్ రెడ్డి, పందిరి రాజిరెడ్డి, చింతకుంట రాజు, మోతె భాస్కర్ రెడ్డి, కమ్మరి గంగారాంలు, రాజేశ్వర్ రెడ్డి, వార్డ్ సభ్యులు శివనూరి నర్సింలు, రొడ్డ లావణ్య బాబు, సదుగు సామెల్, ప్రభాకర్, మహేశ్ మహరాజ్, పాల్గొన్నారు

# ఆశా కార్యకర్తల అక్రమ అరెస్టులను ఖండించండి

## సిఐటియు జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి:సెప్టెంబర్ 08(పోరు తెలంగాణ న్యూస్:) :** పోలీస్ స్టేషన్లోనే జరిగిన ఆశ వర్కర్ల సమావేశంలో చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఇందిరా పార్కు ధర్నాకు బయలుదేరిన ఆశా కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గుచేటని అన్నారు, ఆశా వర్కర్లకు 18000 ఫిక్స్ వేతనం నిర్ణయం చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆరు నెలల పిఆర్సి ఏరియర్స్ లేప్రసి సర్వే, పల్స్ పోలియో ,ఎలక్షన్ డ్యూటీ తదితర పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి, నసీడీ ఆన్లైన్ చేయించకూడదు, స్కూటం డబ్బాలు మోపించకూడదని, ఏఎంసి పి ఎం సి తదితర టార్గెట్స్ ను రద్దు చేయాలి, ఆదివారం పండుగలకు సెలవులు, సంవత్సరానికి 20 క్యాజువల్ సెలవులు, ఆరు నెలల వేతనంతో కూడిన మెడికల్ సెలవులు నిర్ణయించాలని, ఏఎన్ఎం, జి ఎన్ ఎం పోస్టులలో ఆశలకు ప్రమోషన్స్ సౌకర్యం కల్పించాలి, డిమాండ్స్ అన్నిటిని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సెప్టెంబర్ 8న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొనడానికి కామారెడ్డి జిల్లాలోని ఆశా కార్యకర్తలు బయలుదేరుతుంటే అక్రమంగా ఇండల్లోకి వెళ్లి రాత్రి అర్ధరాత్రి రెండు మూడు గంటల సమయంలో గర్జనంగా తీసుకురావడం పొజిషన్లో పెట్టడం దుర్మార్గమైన చర్య అని అన్నారు ఆశా కార్యకర్తలైన జ్యోతి, కల్పన, మంజుల,శిరీష,లావణ్య, మంజుల మరియు రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట, నిజాంబాద్ జిల్లా కమ్మర్పల్లి ఆశాలతో పాటు జిల్లావ్యాప్తంగా మొత్తం 400 మంది ఆశా కార్యకర్తలు అరెస్ట్ అయిన వారిలో ఉన్నారు.

# మర్కల్ మహిళా డిగ్రీ కళాశాలలో జువాలజీ బోధిస్తున్న డాక్టర్ కే. వనజకు ఉస్మానియా విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ పట్టా ప్రధానం




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 08(పోరు తెలంగాణ న్యూస్:) :** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల--కామారెడ్డిలో జువాలజి విభాగాధిపతి అయిన డాక్టర్ కే. వనజ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన 85వ స్నాతకోత్సవంలో పాల్గొని, గౌరవ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 85 వ స్నాతకోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్ల, ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం.కుమార్, ముఖ్య అతిథిగా భారత్ బయోటెక్ వ్యవస్థాపకులు డాక్టర్ కృష్ణ ఎల్లా పాల్గొన్నారు. వారి చేతుల మీదుగా డాక్టర్ కే. వనజ గౌరవ డాక్టరేట్ పట్టాను స్వీకరించారు.విద్యా మరియు పరిశోధనా రంగంలో డాక్టర్ కే. వనజ చేసిన కృషికి గుర్తింపుగా ఈ గౌరవ డాక్టరేట్ లభించడం పట్ల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల--కామారెడ్డి ప్రిన్సిపాల్ సి. శోభారాణి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపక మరియు అధ్యాపకేతర బృందం డాక్టర్ కే. వనజను అభినందించి, ఆమె భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# గణేష్ ఉత్సవాల్లో నిబంధనలు తప్పనిసరి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ప్రశాంతంగా గణపతిఉత్సవాలను జరుపుకోవాలి

: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



**కొత్తగూడెం సెప్టెంబర్ 8 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** జిల్లా లోని ప్రజలందరూ గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో, శాంతియుత ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. ఉత్సవాల సందర్భంగా ప్రజల భద్రత, శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. గణేష్ మండపాల నిర్వాహకులు మండపం ఏర్పాటు చేయడానికి ముందుగానే పోలీసులకు సమాచారం అందించడంతో పాటు పోలీసు శాఖ రూపొందించిన ఆన్‌లైన్ పోర్టల్‌లో మండపానికి సంబంధించిన వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఉత్సవాల సందర్భంగా భద్రత, బందోబస్తు ఏర్పాట్లకు ఈ వివరాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు . గణేష్ మండపాలకు జియో ట్యాగింగ్ చేయాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా డీజేలకు ఎలాంటి అనుమతి లేదని స్పష్టం చేశారు. పోలీసుల అనుమతితో నిబంధనలకు లోబడి పరిమిత శబ్దంతో స్పీకర్లు మాత్రమే వినియోగించాలని, రాత్రి 10 గంటల తర్వాత లౌడ్‌స్పీకర్లు వినియోగించరాదని తెలిపారు. చిన్నారులు, వృద్ధులు తదితరులకు ఇబ్బంది కలిగించే విధంగా పరిమితికి మించి శబ్దాలు వినియోగించరాదన్నారు. నిమజ్జనం సందర్భంగా పోలీసుల సూచనలు, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. నిర్ణీత సమయాల్లోనే నిమజ్జన శోభాయాత్ర నిర్వహిస్తూ ప్రజలు, ఇతర వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని సూచించారు. శోభాయాత్రలో టపాసులు పేల్చడం, డీజేలు ఏర్పాటు చేయడం నిషేధమని తెలిపారు. శోభాయాత్రలో పాల్గొనే వారు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించే విధంగా వాహనాలను రహదారులపై నిలిపివేయరాదని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో పోలీసుల సూచనలను పాటిస్తూ సహకరించాలని కోరారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తూ పోలీసు శాఖకు ప్రజలు, మండపాల నిర్వాహకులు సంపూర్ణ సహకారం అందించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# కామారెడ్డి జిల్లాకు బదిలీపై వచ్చిన ఎక్సైజ్ శాఖ అధికారులు



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి :సెప్టెంబర్ 08(పోరు తెలంగాణ న్యూస్) :** కామారెడ్డి జిల్లాకు బదిలీపై పలువురు ఎక్సైజ్ శాఖ అధికారులు వచ్చారని ఎక్సైజ్ శాఖ అధికారి ముకుంద రెడ్డి తెలిపారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహించేందుకు అధికారులు నియమితులయ్యారని ఆయన పేర్కొన్నారు.

**బదిలీపై వచ్చిన అధికారుల వివరాలు ఇలా ఉన్నాయి:**

బి. శ్రీనివాస్ -- ఏపీఈఎస్, కామారెడ్డి

కె. పోశెట్టి -- పీఅండ్ఈఐ, ఎస్‌హెచ్ఓ కామారెడ్డి

ఎం.డి. అక్బర్ హుస్సేన్ -- పీఅండ్ఈఐ, సీపీ సలాబత్‌పూర్

వై. సర్వేశ్వర్ రావు -- పీఅండ్ఈఐ, ఎస్‌హెచ్ఓ దోమకొండ

జి. లావణ్య సంధ్య -- పీఅండ్ఈఐ, ఎస్‌హెచ్ఓ బాన్సువాడ

వినోద్ రాథోడ్ -- పీఅండ్ఈఐ, ఎస్‌హెచ్ఓ బిచ్కుంద

చ. మంగమ్మ -- పీఅండ్ఈఐ, ఎస్‌హెచ్ఓ ఎల్లారెడ్డి

వి. శ్రీనివాసులు -- పీఅండ్ఈఐ, డీటీఎఫ్ కామారెడ్డి

టి. కిరణ్ -- పీఅండ్ఈఎస్ఐ, ఎస్‌హెచ్ఓ కామారెడ్డి

కె. విజయ సిద్ధార్థ -- పీఅండ్ఈఎస్ఐ, ఎస్‌హెచ్ఓ కామారెడ్డి

ఎం.డి. షఫియుల్లా ఖాన్ -- పీఅండ్ఈఎస్ఐ, ఎస్‌హెచ్ఓ బిచ్కుంద

జిల్లాలో ఎక్సైజ్ శాఖ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, చట్టపరమైన నిబంధనలను కఠినంగా అమలు చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా అధికారులు విధులు నిర్వహించాలని ముకుంద రెడ్డి సూచించారు.

# ఎస్‌పీఎం కార్మికుల రిలే నిరాహార దీక్షలు 112వ రోజుకు

**పోరు తెలంగాణ సెప్టెంబర్ 08 : కొముురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించి కార్మికులకు న్యాయం చేయాలి కాగజ్‌నగర్: సిర్పూర్ పేపర్ మిల్ (ఎస్‌పీఎం)లో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు 112వ రోజుకు చేరుకున్నాయి. ఈరోజు దీక్షలో కూర్చున్నవారు అబ్దుల్ నబి గారు మద్దతుగా కూర్చున్నవారు వెంకటేశు షబ్బీర్ రాజన్న మల్లేష్ ఏ కేసింగ్ తదితరులు మద్దతుగా కూర్చున్నారు గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించి, కార్మికుల సమస్యలపై యాజమాన్యంతో చర్చలు జరిపి వేతన ఒప్పందం చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. 112 రోజులు దాటినా ప్రభుత్వం, యాజమాన్యం స్పందించకపోవడం పట్ల కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం, ఎస్‌పీఎం యాజమాన్యం స్పందించి వెంటనే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించి కార్మికులకు న్యాయం చేయాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు.

# ఆసిఫాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 75 రకాల వైద్య పరీక్షలకు మల్టీ-పారామెట్రిక్ డయాగ్నస్టిక్ సిస్టమ్స్

కలెక్టర్ కె హరిత.....



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 08: కొముురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొముురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (ఏవియానిక్స్ డివిజన్, హైదరాబాద్), ఓమిని యాక్టివ్ ఫౌండేషన్ సహకారంతో సీఎస్ఆర్ కార్యక్రమం ద్వారా 22 మల్టీ-పారామెట్రిక్ డయాగ్నస్టిక్ సిస్టమ్‌లను సమకూర్చినట్లు కలెక్టర్ కె హరిత తెలిపారు. వీటి ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే 75 రకాల వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో మంగళవారం అదనపు కలెక్టర్ యువరాజ్ మార్మాట్, ఓమిని యాక్టివ్ ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ బటియాతో కలిసి కలెక్టర్ ఈ వ్యవస్థను ప్రారంభించారు. అధునాతన పరికరాల ద్వారా వైటల్స్ మానిటరింగ్, రక్త పరీక్షలు, ఆరోగ్య సమస్యల ముందస్తు గుర్తింపు వంటి సేవలు గ్రామీణ ప్రజలకు మరింత చేరువ అవుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. నాణ్యమైన వైద్య సేవల్లో సహకరిస్తున్న హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ సంస్థకు జిల్లా యంత్రాంగం కృతజ్ఞతలు తెలిపింది. జిల్లాలో ఆరోగ్య సేవలను బలోపేతం చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నాగేంద్ర, అకాంక్షిత జిల్లా సమన్వయ కర్త బాలరాజు, వైద్య అధికారులు, ల్యాబ్ టెక్నీషియన్లు, నర్సులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వినాయక మండపాలు, నిమజ్జన కార్యక్రమాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలి

కలెక్టర్ కె. హరిత.....



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 08: కొముురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొముురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వినాయక చవితి సందర్భంగా జిల్లాలో ఏర్పాటు చేసే వినాయక మండపాలు, నిమజ్జన కార్యక్రమాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు, ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో మంగళవారం ఎస్పీ నితికా పంత్, అదనపు కలెక్టర్లు యువరాజ్ మార్మాట్, ఎం. డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి తదితరులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండపాల వద్ద భద్రతా చర్యలు పకడ్బందీగా చేపట్టాలని, నిమజ్జన ప్రాంతాలను ముందుగానే గుర్తించి ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, అగ్నిమాపక, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు. విద్యుత్ శాఖ భద్రతా చర్యలు, మున్సిపల్ అధికారులు పారిశుద్ధ్యం, మిషన్ భగీరథ అధికారులు తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలో నిమజ్జనానికి క్రేన్లు, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని, సోషల్ మీడియా ప్రచారాలపై అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలు నిబంధనలు పాటిస్తూ సహకరించాలని కలెక్టర్ కోరారు .

# ఇప్పపువ్వు లడ్డూలకు ప్రశంసలు

సంప్రదాయ ఆహారానికి ప్రోత్సాహం....

మహిళా స్వయం ఉపాధికి మార్గం.....



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 08: కొముురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొముురం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలంలోని బోధంపల్లి గ్రామానికి చెందిన గోమాసి రాజేశ్వరి తయారు చేసిన సంప్రదాయ ఇప్పపువ్వు లడ్డూలు గురుద్‌పేట్ గ్రామంలో నిర్వహించిన ఎక్స్‌పోజర్ విజిట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎక్స్‌పోజర్ విజిట్‌కు విచ్చేసిన సర్పంచ్‌తో పాటు రైతు సోదరులకు రాజేశ్వరి లడ్డూలను రుచి చూపించగా, వాటి రుచి, నాణ్యతపై వారు ప్రశంసలు కురిపించారు. ఇప్పపువ్వు ఆదివాసీ సమాజంలో తరతరాలుగా ఉపయోగిస్తున్న సంప్రదాయ ఆహార పదార్థాల్లో ఒకటి. ఇప్పపువ్వుతో తయారు చేసే లడ్డూలలో బెల్లం, పల్లీలు, నువ్వులు, డ్రైఫ్రూట్స్ వంటి పదార్థాలను ఉపయోగించే పద్ధతులు ఉన్నాయి. ఈ ఆహారాన్ని ఆధునిక రూపంలో పరిచయం చేయడం ద్వారా సంప్రదాయ ఆహార సంస్కృతిని కాపాడటంతో పాటు మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతున్నాయి. బోధంపల్లి గ్రామంలో రాజేశ్వరి చేపట్టిన ఈ వినూత్న ప్రయత్నం స్థానికంగా లభించే అటవీ ఉత్పత్తులకు విలువ జోడించడంతో పాటు, సంప్రదాయ ఆహారాన్ని ప్రోత్సహించడానికి మంచి ఉదాహరణగా నిలుస్తోంది. ఇప్పపువ్వు లడ్డూలను తయారు చేసి పరిచయం చేసిన గోమాసి రాజేశ్వరి కార్యక్రమంలో పాల్గొన్న వారు అభినందనలు తెలిపారు. ఇలాంటి స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహిస్తే గ్రామీణ మహిళలకు అదనపు ఆదాయ మార్గాలు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# చెన్నూర్ లో కూల్చివేసిన దుకాణాలపై ఆధారపడి జీవించే వారికి ఆర్థిక ఇబ్బందులు. ఫైనాన్స్ వాళ్ల వేధింపులు



**పోరుతెలంగాణ ప్రతినిధి చెన్నూరు::** పాత బస్టాండ్ నుంచి రాయి చెట్టు వరకు జరిగిన రోడ్డు వెడల్పు పనుల్లో చిన్న దుకాణాలను కూల్చివేయడంతో, ఆ దుకాణాలపై ఆధారపడి జీవించే వ్యాపారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**వారి ప్రధాన ఆవేదనలు:**

దుకాణాలు కూల్చివేసి ఆరు నెలలు గడిచినా తిరిగి నిర్మించి ఇవ్వలేదు. దుకాణాలు లేకపోవడంతో జీవనోపాధి కోల్పోయారు. దుకాణాల కోసం తీసుకున్న ఫైనాన్స్ రుణాల వాయిదాలు చెల్లించలేకపోతున్నారు. ఫైనాన్స్ సంస్థల నుంచి వేధింపులు, ఒత్తిళ్లు ఎదురవుతున్నాయని దుకాణదారులు చెబుతున్నారు. రోడ్డు వెడల్పు సమయంలో దుకాణాలు కూల్చివేసినప్పటికీ, తిరిగి దుకాణాలు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారని పేర్కొంటున్నారు. మంత్రి వివేక్ వెంకటస్వామి, చెన్నూర్ కమిషనర్ సంబంధిత రోడ్డు వెడల్పు అధికారులను వెంటనే స్పందించి దుకాణాలు తిరిగి నిర్మించి న్యాయం చేయాలని కోరుతున్నారు. సంక్షిప్తంగా చెప్పాలంటే: రోడ్డు వెడల్పు కోసం కూల్చిన మా చిన్న దుకాణాలను ఆరు నెలలు గడిచినా తిరిగి నిర్మించలేదు. జీవనోపాధి లేక రుణాలు చెల్లించలేక ఫైనాన్స్ వేధింపులు ఎదుర్కొంటున్నాం. వెంటనే దుకాణాలు నిర్మించి ఇవ్వాలి" అనేది కోరుకుంటున్నారు.

# కాగజ్‌నగర్‌లో మండల స్థాయి ఉపాధ్యాయ దినోత్సవ పురస్కార మహోత్సవం



**పోరు తెలంగాణ సెప్టెంబర్ 08: కొముురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా కాగజ్‌నగర్ మండల స్థాయి ఉపాధ్యాయ దినోత్సవ పురస్కార మహోత్సవాన్ని మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించారు. మండల అభివృద్ధి అధికారి ఉజ్వల్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, దేశభక్తి పెంపొందించడంలో ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్, జిల్లా విలీన విద్య కోఆర్డినేటర్ కొయ్యడ శ్రీనివాస్ కార్యక్రమంలో పాల్గొని ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను సన్మానించి పురస్కారాలు అందజేశారు.విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తున్నారని, ప్రభుత్వ విద్యా కార్యక్రమాల అమలులో వారి సహకారం ముఖ్యమని ఎం ఇ ఓ వాసాల ప్రభాకర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, ఎంఆర్సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కౌంటర్‌కు రీ కౌంటర్ సవాల్‌కు ప్రతి సవాల్

ఆసిఫాబాద్ రాజకీయాలు .....

మీడియా సమావేశాలతో వేడెక్కుతున్న రాజకీయ వాతావరణం.....

మాటల యుద్ధం ముదురుతున్న వేళ.....

ప్రజా సమస్యలు ఎక్కడ?

విమర్శలు, ఆరోపణలకే పరిమితమవుతున్న రాజకీయాలు.. అభివృద్ధిపై చర్చ ఎప్పుడు?




**పోరు తెలంగాణ సెప్టెంబర్ 08: కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రాజకీయాలు రోజురోజుకూ ఆసక్తికర మలుపులు తిరుగుతున్నాయి. రాజకీయ ప్రత్యర్థుల మధ్య మాటల యుద్ధం ముదురుతోంది. ఒకరి వ్యాఖ్యలకు మరొకరు కౌంటర్ ఇవ్వడం.. ఆ కౌంటర్‌కు రీ కౌంటర్ ఇవ్వడం.. ఒకరు సవాల్ విసిరితే మరొకరు ప్రతి సవాల్ చేయడం.. ఇలా రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. మీడియా సమావేశాలు రాజకీయ విమర్శలకు ప్రధాన వేదికలుగా మారుతున్న నేపథ్యంలో జిల్లాలో అసలు రాజకీయాలు ఏ దిశగా సాగుతున్నాయనే చర్చ ప్రజల్లో మొదలైంది.

**మీడియా ముందుకు వచ్చి.. ప్రత్యర్థులపై విమర్శలు**

ఇటీవల జిల్లాలో రాజకీయ నాయకులు వరుసగా మీడియా సమావేశాలు నిర్వహిస్తూ తమ రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు గుప్పిస్తున్నారు. తాము చేసిన అభివృద్ధి పనులను ఒకరు ప్రస్తావిస్తే.. గతంలో అధికారంలో ఉన్న వారు ఏం చేశారంటూ మరొకరు ప్రశ్నిస్తున్నారు. దీనికి సమాధానంగా మళ్లీ మరో మీడియా సమావేశం నిర్వహించి గత ప్రభుత్వ హయాంలో జరిగిన పనులు, ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను ప్రస్తావిస్తూ కౌంటర్లు ఇస్తున్నారు. ఒకరి మాట పూర్తయ్యేలోపే మరొకరి స్పందన రావడం, ఆరోపణలకు వెంటనే ప్రతి ఆరోపణలు చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దీంతో మీడియా సమావేశాల ద్వారా రాజకీయ నాయకులు ప్రజలకు ఏ సందేశం ఇస్తున్నారన్నది కూడా ఆసక్తికరంగా మారింది.

**కౌంటర్‌కు రీ కౌంటర్.. మాటల మంటలు**

జిల్లా రాజకీయాల్లో ప్రస్తుతం ఎక్కువగా వినిపిస్తున్న పదాలు కౌంటర్.. రీ కౌంటర్. ఒక నాయకుడు చేసిన వ్యాఖ్యలను మరో నాయకుడు ఖండించడం, తనదైన శైలిలో విమర్శలు చేయడం, ఆ తర్వాత మళ్లీ మొదటి నాయకుడు స్పందించడం వంటి పరిణామాలు వరుసగా చోటుచేసుకుంటున్నాయి. దీంతో రాజకీయ విమర్శలు ఆరోగ్యకరమైన చర్చలుగా కాకుండా ఒకరిపై ఒకరు పైచేయి సాధించేందుకు జరుగుతున్న మాటల పోరుగా మారుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయాల్లో భిన్నాభిప్రాయాలు ఉండటం సహజమే అయినా.. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా విమర్శలు ఉండాలని పలువురు కోరుతున్నారు.

**సవాల్‌కు ప్రతి సవాల్.. ఎవరికి పైచేయి?**

మాటల యుద్ధంతో పాటు సవాళ్ల రాజకీయాలు కూడా ఊపందుకుంటున్నాయి. ఒకరు ఒక అంశంపై సవాల్ విసిరితే.. దానికి మరొకరు ప్రతిస్పందిస్తూ ప్రతి సవాల్ చేయడం చర్చకు దారితీస్తోంది. దీంతో రాజకీయ పోరాటం విధానాలపై కాకుండా వ్యక్తుల మధ్య పోటీగా మారుతోందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రాజకీయ నాయకులు ఒకరినొకరు సవాలు చేసుకోవడం కంటే.. తమ నియోజకవర్గం, తమ జిల్లా అభివృద్ధిపై పోటీ పడితే ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఎవరు ఎవరిని ఓడించారు అనే దానికంటే ఎవరు ప్రజల సమస్యలను పరిష్కరించారు అనేదే ముఖ్యమని అంటున్నారు.

**ప్రజా సమస్యలు ఎక్కడ?**

ఇదే సమయంలో రాజకీయ విమర్శల మధ్య అసలు ప్రజా సమస్యలు మరుగున పడుతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో అనేక సమస్యలు పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయి. తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, విద్య, వైద్యం, ఉపాధి, రైతుల సమస్యలు, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు వంటి అంశాలపై ప్రజలు పరిష్కారాలను ఆశిస్తున్నారు. ప్రజలు తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకెళ్లినప్పుడు వాటిపై నిరంతరం పోరాడే నాయకత్వం అవసరమని అంటున్నారు. మీడియా సమావేశాల్లో ప్రత్యర్థులపై విమర్శలు చేయడానికి ఎంత సమయం కేటాయిస్తున్నారో.. అదే స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికి కూడా సమయం కేటాయించాలని కోరుతున్నారు.

**అభివృద్ధిపై చర్చ ఎప్పుడు?**

రాజకీయ నాయకుల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్నప్పటికీ.. జిల్లాకు రాబోయే రోజుల్లో ఎలాంటి అభివృద్ధి ప్రణాళికలు అవసరం? ఏ ప్రాంతానికి ఏ సదుపాయాలు కావాలి? యువతకు ఉపాధి అవకాశాలు ఎలా పెంచాలి? రైతుల సమస్యలను ఎలా పరిష్కరించాలి? ఆదివాసీ ప్రాంతాల్లో మౌలిక వసతులను ఎలా మెరుగుపరచాలి? వంటి అంశాలపై సమగ్ర రాజకీయ చర్చ అవసరమనే అభిప్రాయం వినిపిస్తోంది. ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజా సమస్యలను ప్రస్తావించడం కాకుండా.. నిత్యం ప్రజల మధ్య ఉండి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం కృషి చేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని ప్రజలు గుర్తు చేస్తున్నారు.

**విమర్శలు అవసరమే.. కానీ హద్దులు దాటకూడదా?**

ప్రజాస్వామ్యంలో అధికార పక్షాన్ని ప్రతిపక్షం ప్రశ్నించడం, ప్రభుత్వ నిర్ణయాలను విమర్శించడం అవసరమే. అలాగే అధికార పక్షం కూడా ప్రతిపక్ష విమర్శలకు సమాధానం ఇవ్వడం సహజం. అయితే విమర్శలు వ్యక్తిగత స్థాయికి వెళ్లకుండా విధానాలు, పాలన, అభివృద్ధి, ప్రజా సంక్షేమం చుట్టూ ఉండాలని ప్రజాస్వామ్యవాదులు అభిప్రాయపడుతున్నారు. వ్యక్తిగత ఆరోపణలు ఎక్కువైతే అసలు సమస్య పక్కకు వెళ్లే అవకాశం ఉందని, రాజకీయ నాయకుల మాటలను ప్రజలు గమనిస్తున్నారని పలువురు అంటున్నారు. నాయకులు ఏం మాట్లాడుతున్నారు అనే దానితో పాటు.. ఏం చేస్తున్నారు అనే దానినే ప్రజలు చివరకు కొలమానంగా తీసుకుంటారని చెబుతున్నారు.

**మీడియా సమావేశాలు.. ప్రజల గొంతుకగా మారాలి**

మీడియా సమావేశాలు ప్రజాస్వామ్యంలో కీలకమైన వేదికలు. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, తమ విధానాలను ప్రజలకు వివరించడం కోసం రాజకీయ నాయకులు ఈ వేదికను ఉపయోగించుకోవచ్చు. అయితే మీడియా సమావేశాలు కేవలం ప్రత్యర్థులపై విమర్శలకు మాత్రమే పరిమితం అయితే దాని వల్ల ప్రజలకు ఎంత ప్రయోజనం ఉంటుందనే ప్రశ్న తలెత్తుతుంది. జిల్లాలోని ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం, సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లడం, పరిష్కారం జరిగే వరకు పోరాటం చేయడం వంటి అంశాలకు మీడియా సమావేశాలు వేదికగా మారాలని ప్రజలు కోరుతున్నారు.

**రాజకీయ వేడి.. ప్రజలకు ప్రయోజనం ఎంత?**

ప్రస్తుతం జిల్లాలో రాజకీయంగా ఎవరి వాదన బలంగా ఉంది? ఎవరి కౌంటర్‌కు ఎక్కువ ప్రచారం వచ్చింది? ఎవరి సవాల్‌కు ఎవరు సమాధానం ఇచ్చారు? అనే అంశాల చుట్టూ చర్చ సాగుతోంది. కానీ ఈ చర్చల వల్ల సామాన్య ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పు వస్తుందన్నది అసలు ప్రశ్న. రాజకీయ నాయకుల మధ్య పోటీ ఉండాలి.. కానీ ఆ పోటీ ప్రజల కోసం ఉండాలి. ఒకరు ఒక రహదారి సమస్య పరిష్కరిస్తే మరొకరు మరో గ్రామ సమస్య పరిష్కరించేందుకు ముందుకు రావాలి. ఒకరు యువత కోసం కార్యక్రమం చేపడితే మరొకరు ఉపాధి అవకాశాల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. ఇలాంటి పోటీ ఉంటే ప్రజాస్వామ్యం మరింత బలపడుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

**మాటలతో కాదు.. పనులతో సమాధానం ఇవ్వాలి**

రాజకీయాల్లో మాటలకు తాత్కాలికంగా చప్పట్లు రావచ్చు. కానీ ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చే పనులకే శాశ్వత గుర్తింపు ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. ఎవరు ఎక్కువగా మాట్లాడారు అనే దానికంటే.. ఎవరు ఎక్కువగా పనిచేశారు? ఎవరు ప్రజల మధ్య ఉన్నారు? ఎవరు సమస్యను పరిష్కరించారు? అనే ప్రశ్నలకే భవిష్యత్తులో ప్రాధాన్యత ఉంటుందని అంటున్నారు. కొమురం భీం ఆసిఫాబాద్ వంటి జిల్లాలో రాజకీయ నాయకులు పరస్పర విమర్శలకే పరిమితం కాకుండా జిల్లా అభివృద్ధిపై ఒక స్పష్టమైన చర్చకు ముందుకు రావాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

**రాజకీయాలు ఎటు.. ప్రజలు ఏమంటున్నారు?**

కౌంటర్‌కు రీ కౌంటర్.. సవాల్‌కు ప్రతి సవాల్.. ఆరోపణలకు ప్రతి ఆరోపణ.. ఇలా రాజకీయ వాతావరణం వేడెక్కుతున్నా ప్రజలు మాత్రం తమ సమస్యలకు పరిష్కారం కోరుతున్నారు. రాజకీయ నాయకులు తమ మధ్య ఉన్న విభేదాలను పక్కన పెట్టి ప్రజా సమస్యలపై కలిసి పనిచేసే సందర్భాలు కూడా రావాలని పలువురు ఆశిస్తున్నారు. రాజకీయాల్లో పోటీ ఉండటం తప్పు కాదు. కానీ ఆ పోటీ అభివృద్ధి కోసం ఉండాలి. విమర్శలు ఉండాలి.. కానీ అవి ప్రజా ప్రయోజనాల కోసం ఉండాలి. సవాళ్లు ఉండాలి.. కానీ అవి ప్రజలకు మెరుగైన పాలన అందించడంలో ఉండాలి.

**ముగింపు మాట..**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రాజకీయాల్లో ప్రస్తుతం "కౌంటర్‌కు రీ కౌంటర్.. సవాల్‌కు ప్రతి సవాల్" అన్న పరిస్థితి కనిపిస్తోంది. ఈ మాటల యుద్ధం ఇంకా ఎంతకాలం కొనసాగుతుందో పక్కన పెడితే.. ప్రజల సమస్యలు మాత్రం పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయి. ప్రత్యర్థిని ఓడించడమే రాజకీయ విజయం కాదు.. ప్రజల సమస్యను పరిష్కరించడమే అసలైన విజయం. మాటలతో పైచేయి సాధించడం కాదు.. పనులతో ప్రజల మనసు గెలవడమే నిజమైన రాజకీయ నాయకత్వం. ఇకనైనా ఆసిఫాబాద్ జిల్లా రాజకీయాలు విమర్శలు, ప్రతి విమర్శల నుంచి బయటపడి.. ప్రజా సమస్యలు, అభివృద్ధి, సంక్షేమం వైపు మళ్లాలని జిల్లా ప్రజలు కోరుకుంటున్నారు.

# భార్యను హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించిన భర్తకు జీవిత ఖైదు




**పోరు తెలంగాణ సెప్టెంబర్ 08: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** వాంకిడి మండలం 2023 మార్చి 3న వాంకిడి మండలం బంబారా గ్రామ శివారులో జరిగిన భార్య హత్య కేసులో నిందితుడు తోడసం శ్యాంరావు (25, చిచ్చుపల్లి గ్రామం, వాంకిడి మండలం)కు ఆసిఫాబాద్ జిల్లా, సెషన్స్ కోర్టు జీవిత ఖైదు, రూ.15,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. కేసు వివరాలు: 2023 మార్చి 3న రాత్రి భార్య తోడసం సంధ్యారాణితో కలిసి మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా, ఆమె మొబైల్ ఫోన్ రోడ్డుపై పడటంతో తీసుకునేందుకు కిందకు దిగింది. ఆ సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆమె మరణించినట్లు నిందితుడు పోలీసులను నమ్మించాడు. తొలుత వాంకిడి పోలీస్ స్టేషన్‌లో రోడ్డు ప్రమాద మరణం కింద కేసు నమోదైంది. దర్యాప్తు కొనసాగుతుండగా, నిందితుడు భార్యను రాయితో కొట్టి హత్య చేసి, ప్రమాదంగా చిత్రీకరించినట్లు మృతురాలి తండ్రి ఇచ్చిన సమాచారంతో అనుమానం తలెత్తింది. లోతైన దర్యాప్తులో నిందితుడు భార్యపై అనుమానంతో తరచూ గొడవపడేవాడని, ప్రయాణ సమయంలో రోడ్డు పక్కకు లాగి రాయితో కొట్టి హత్య చేసినట్లు ఆధారాలు లభించాయి. రక్తపు మరకలున్న రాయి, మట్టి వంటి భౌతిక ఆధారాలు, వైద్య-ఫోరెన్సిక్ ఆధారాల ఆధారంగా హత్య, సాక్ష్యాలను తారుమారు చేసిన అభియోగాలపై చార్జ్‌షీట్ దాఖలు చేశారు. న్యాయమూర్తి బి. శారదా దేవి సాక్ష్యాలను సమగ్రంగా పరిశీలించి నిందితుడికి జీవిత ఖైదు, జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్లు జగన్మోహన్ రావు, ఎం. శ్రీనివాస్ రావు వాదనలు వినిపించారు. దర్యాప్తు అధికారి బి. శ్రీనివాస్‌తో పాటు డీఎస్పీ అశోక్, సీఐ ఎస్. వేణుగోపాల్, ఎస్సై డి. మహేందర్, లైజనింగ్ ఆఫీసర్ కె. బాల్ సింగ్, సబ్ డివిజన్ సీడీఓ రాంసింగ్ చేసిన కృషిని జిల్లా ఎస్పీ నితికా పంత్ అభినందించారు.

# పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ ను విడుదల చేయాలి

**పోరు తెలంగాణ, సెప్టెంబర్ 8 :** విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడకుండా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట భారతీయ జనతా పార్టీ, భారతీయ జనతా యువమోర్చా నాయకులు భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. యువమోర్చా నాయకులు ఎర్రోళ్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ 'చావు డప్పు' కొట్టి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.




ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పట్టణ అధ్యక్షులు పెంజర్ల రాకేష్ సీనియర్ నాయకులు తంగడ రాజేశ్వరరావు, పోల్సాని సంపత్ రావు, మేకల శ్రీనివాస్, ఒల్లే తిరుపతి,ఈర్ల శంకర్, కావేటి రాజగోపాల్, బీజేవైఎం రాష్ట్ర నాయకులు ఉప్పు కిరణ్ రాజమహంత,పట్టణ ప్రధాన కార్యదర్శులు గుడ్ల సతీష్ బోలవేన సురేందర్, గాదాసి సతీష్, బొడ్డుపల్లి కుమార్, సబ్బు మల్లయ్య, పడాల శ్రీనివాస్ గౌడ్ వీరేశం గౌడ్ గడ్డం అనిల్, సుంకనపల్లి ఆంజనేయులు ఇంజపురి సోనీ పెద్దపల్లి యువ మోర్చా నాయకులు కుశానపల్లి మధుకరన్ కుక్క అంజి, పెద్దపల్లి మండల యువమోర్చా అధ్యక్షులు రెడ్ల వేణు కాల్వ శ్రీరాంపూర్ మండల యువమోర్చా అధ్యక్షులు దిలీప్ ఓదెల యువమోర్చా నాయకులు శాతల్లా కుమార్ సిలారపు మహేష్ కలవెల్లి నవీన్ ,మంద దేవరాజ్

**పంది సాయి కుమార్ ,నూతి విరాట్**

తుడి అఖిల్, లక్ష్మణ్ అఖిల్ ,తిప్పని నరేశ్ భాకం రాజు పూరెల్ల అభి ఓర్పుల రాజేశ్,హరీష్, నరేశ్, కళ్యాణ్,గుమ్మడి నరేష్ ,మోధుంపల్లి కళ్యాణ్, శంబోజు కల్యాణ్,కుందేళ్ళ శ్రీనివాస్,సంఘం వంశీ,జెట్టి రాకేశ్,అలవేని జశ్వంత్, సంగం అభిషేక్,పుల్ల పరుశురాం, జాజి రాకేష్,వినోద్,హరీష్,పవన్,సందీప్,సుశాంత్ ఇతర నాయకులు పాల్గొన్నారు.



# తాత మధుపై చర్యలుద తీసుకోవాలని ఇప్ప రమేష్ డిమాండ్

దళిత ఆత్మగౌరవ అవమానంపై కాంగ్రెస్ నేత ఆగ్రహం

**పోరు తెలంగాణ సెప్టెంబర్ 08; కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** రెబ్బెన మండలం తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను పులికుంట గ్రామ కాంగ్రెస్ నాయకుడు ఇప్ప రమేష్ ఖండించారు. రాజకీయ విమర్శకు, వ్యక్తిగత గౌరవాన్ని కించపరచడానికి తేడా ఉందని, స్పీకర్ పదవి రాజ్యాంగబద్ధమైనదని, దాని గౌరవాన్ని అందరూ కాపాడాలని పేర్కొన్నారు. దళితుల ఆత్మగౌరవం తరతరాల పోరాట ఫలితమని, దళిత సమాజం నుంచి ఎదిగిన వ్యక్తి అత్యున్నత రాజ్యాంగ పదవి చేపట్టడం వెనుక ఎందరో త్యాగం ఉందని గుర్తుచేశారు. తాత మధు వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని, పార్టీ నాయకత్వం కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఇప్ప రమేష్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధినేత, రాష్ట్ర నాయకత్వం ఈ అంశంపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలని కోరారు.

# ఖర్గేకు జరిగిన అవమానాన్ని తీవ్రంగా ఖండించిన ఎంపీ వంశీకృష్ణ

ఎస్సీ, ఎస్టీల గౌరవం, హక్కుల పరిరక్షణకు పోరాటం: కాంగ్రెస్ ఎంపీలు



**పోరు తెలంగాణ, సెప్టెంబర్ 8 :** ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పర్యటించిన ప్రాంతంలో "శుద్ధికరణ" పేరుతో జరిగిన ఘటనను కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ ఎంపీల ఫోరం తీవ్రంగా ఖండించింది. ఈ ఘటన దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా ఉందని కాంగ్రెస్ ఎంపీలు ఆగ్రహం వ్యక్తం చేశారు మంగళవారం అక్బర్ రోడ్‌లోని ఏఐసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ ఎంపీల ఫోరం తొలి సమావేశం జరిగింది. సమావేశానికి తెలంగాణ నుంచి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎంపీ మల్లు రవి, ఎంపీ బలరాం నాయక్ హాజరయ్యారు. సమావేశం అనంతరం కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ ఎంపీలు ఢిల్లీ పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఉత్తరాఖండ్ ఘటనపై ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించారు. అయితే పోలీసులు ఎంపీలను పోలీస్ స్టేషన్‌లోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. స్టేషన్ వద్ద భారీ గేట్లు ఏర్పాటు చేసి, పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరించారు. ఖర్గే పర్యటించిన ప్రాంతంలో "శుద్ధికరణ"కు పాల్పడిన వ్యక్తులపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీలు డిమాండ్ చేశారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి ఘటనలకు చోటు ఉండకూడదని స్పష్టం చేశారు. మల్లికార్జున ఖర్గేకు జరిగిన అవమానాన్ని ఎంపీ గడ్డం వంశీకృష్ణ తీవ్రంగా ఖండించారు. ఎస్సీ, ఎస్టీల గౌరవం, హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని, ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఖర్గేకు జరిగిన అవమానానికి నిరసనగా ఈ నెల 12న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భారీ ధర్నా నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ ఎంపీల ఫోరం ప్రకటించింది.

# తనకు తానుగా స్వచ్ఛందంగా పెండింగ్ ప్రత్యేకంగా అభినందించిన ఎస్సై శైలేందర్

**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** బాల్కొండ మండల కేంద్రంలోని బస్సాపూర్ రహదారి ప్రాంతంలో బాల్కొండ ఎస్సై శైలేందర్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు.తనిఖీ నిర్వహిస్తున్న క్రమంలో నల్లూర్ రాజేశ్వర్ అనే వ్యక్తి పోలీసు వారిని సమీపించి తన ద్విచక్ర వాహనం తన దగ్గర లేకున్నప్పటికీ పోలీసు వారి దగ్గర ఉన్న టీఎస్ ఈ టికెట్ ద్వారా తన ద్విచక్ర వాహనం పై గల 8 చలాన్లు 2680 రూపాయలు తనకు తానుగా స్వచ్ఛందంగా చెల్లించారు. ఇలాంటి బాధ్యతగల పౌరులు నేటి సమాజానికి ఆదర్శ వంతులుగా ఉండగలరని ఎస్ఐ నల్లూర్ రాజేశ్వర్ ను అభినందించారు.ప్రతి వాహనదారులు కూడా మీ వాహనాలపై గల చలాన్ లు పోలీసు వారి సంప్రదించి టీ ఎస్ ఈ టికెట్ యాప్ ద్వార, లేదా మీ సేవ ద్వార గాని చలన్లను క్లియర్ చేసుకోవాలని హెచ్చరించారు.



# ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకం అమలుకు ఏర్పాట్లు చేయాలి

ప్రణాళికా శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్.....






**పోరు తెలంగాణ సెప్టెంబర్ 08: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రణాళికా శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో పథకం అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 1 కోటి 6 లక్షల అర్హత గల కుటుంబాలకు ఈ పథకం త్వరలో అమలు చేయనున్నట్లు, ఇందుకోసం జిల్లాల్లో విధి విధానాలు రూపొందించుకోవాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ కె. హరిత సమావేశంలో పాల్గొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పథకం అమలుకు విధి విధానాలు రూపొందిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

# షెడ్యూల్డ్ కులాల అభ్యర్థులకు స్వయం ఉపాధి అవకాశాల కల్పనకు చర్యలు

కలెక్టర్ కె. హరిత....




**పోరు తెలంగాణ సెప్టెంబర్ 08: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన అర్హులైన అభ్యర్థులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ కె. హరిత తెలిపారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో 2025-26 సంవత్సరానికి షెడ్యూల్డ్ కులాల అభ్యర్థుల స్వయం ఉపాధి పథకం ఆర్థిక పురోగతిపై నిర్వహించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశానికి అదనపు కలెక్టర్ యువరాజ్ మార్మాట్‌తో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో మంజూరైన యూనిట్లను అర్హులైన అభ్యర్థులకు అందించి, వారి ఆర్థిక పురోగతిని పెంపొందించే లక్ష్యంతో పథకాలు అమలు చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల సహకార సంస్థ కార్యనిర్వహక సంచాలకులు సురేష్ కుమార్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం. అశోక్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ జనార్ధన్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ మసూద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# లక్షెట్టిపేటలో చోరీ

**పోరు తెలంగాణ, లక్షెటిపేట్, సెప్టెంబర్ 8 :** లక్షెట్టిపేట ఆంధ్రపూరులో ఒక ఇంట్లో చోరీ జరిగింది. ఈనెల ఆరో తారీఖున ఇంటి యజమానులు ఇంటికి తాళం వేసి పని నిమిత్తం హాజీపూర్ వెళ్ళగా గుర్తుతెలియని దొంగలు ఇంట్లోకి చొరబడి తాళం పగలగొట్టి బీరువాలోని 12 వేల రూపాయల నగదు పావుతులం బంగారం రింగ్ దోచుకెళ్లారు. ఈరోజు ఉదయం ఇంటి తాళాలు పగలగొట్టి తలుపులు తెరిచి ఉండడంతో చుట్టుపక్కల వాళ్ళు గమనించి యజమానురాలకు సమాచారం అందించడంతో వాళ్లు వచ్చి చూసేసరికి చోరీ విషయం బయటపడింది. ఇంటి యజమానురాలు దుంపటి సత్తవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయడం జరుగుతుంది అని ఎస్సై గోపతి సురేష్ తెలిపారు.

# రూ.10 లక్షల పెట్టుబడి 5 ఏళ్లలో రూ.25 లక్షలు అదిరిపోయే రిటర్న్స్ ఇచ్చిన ఫండ్!



ఇతర ఫండ్‌లతో పోలిస్తే, ఆస్తుల విలువ పరంగా హెచ్‌డిఎఫ్‌సి మిడ్ క్యాప్ ఫండ్, దేశంలోని అతిపెద్ద ఫండ్ అయిన పరాగ్ పారిఖ్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్‌ను అధిగమించింది. పరాగ్ పారిఖ్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ 5 సంవత్సరాల రాబడి..ఒక మ్యూచువల్ ఫండ్ పెట్టుబడిదారులకు 14 శాతానికి పైగా రాబడిని ఇచ్చింది. అంటే, మీరు ఐదేళ్ల క్రితం అందులో రూ.10 లక్షలు పెట్టుబడి పెట్టి ఉంటే, ఈ రోజు దాని విలువ రూ.19 లక్షలకు పైగా ఉండేది. ఆ ఫండే 'పరాగ్ పారిఖ్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్'. ఆస్తుల విలువ పరంగా దేశంలోనే అగ్రగామి ఫండ్‌గా దీనికి ఘనత ఉంది. కానీ, 19 ఏళ్ల క్రితం ప్రారంభమైన మరో మ్యూచువల్ ఫండ్ ఆ స్థానాన్ని ఆక్రమించింది. ఇది గత ఐదేళ్లలో 20 శాతానికి పైగా అద్భుతమైన రాబడిని ఇచ్చింది. అంటే మీరు ఐదేళ్ల క్రితం అందులో రూ.10 లక్షలు పెట్టుబడి పెట్టి ఉంటే, ఈ రోజు దాని విలువ రూ. 25 లక్షలకు పైగా ఉండేది. ఇది పరాగ్ పారిఖ్ ఫండ్ రాబడి కంటే రూ. 6 లక్షలు ఎక్కువ. ఆ ఫండ్ ఏది? అందులో ఎంత పెట్టుబడి పెట్టడం సరైనదో తెలుసుకుందాం. ఈ ఫండ్ పేరు 'హెచ్‌డిఎఫ్‌సి మిడ్ క్యాప్ ఫండ్'. మార్కెట్ హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ, హెచ్‌డిఎఫ్‌సి మిడ్ క్యాప్ ఫండ్ చాలా బాగా రాణించింది. 2007లో ప్రారంభించిన ఈ ఫండ్ తన 19 ఏళ్ల ప్రయాణంలో పెట్టుబడిదారులను ధనవంతులను చేసింది. ముఖ్యంగా ప్రారంభమైనప్పటి నుండి, ఇది తన బెంచ్‌మార్క్ (15.04%)ను అధిగమించి, సగటున 17.13 శాతం వార్షిక రాబడిని ఇచ్చింది. ఇటీవలి మార్కెట్ హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ, ఈ ఫండ్ చాలా బాగా రాణించింది. భారతదేశంలోని అతిపెద్ద మ్యూచువల్ ఫండ్‌లతో పోలిస్తే, హెచ్‌డిఎఫ్‌సి మిడ్ క్యాప్ ఫండ్ 3, 5 సంవత్సరాలలో అత్యధిక రాబడిని సాధించింది. ఈ ఫండ్ 3 సంవత్సరాలలో 20.58 శాతం, 5 సంవత్సరాలలో 20.69 శాతం వార్షిక రాబడిని ఇచ్చింది. ఇతర ఫండ్‌లతో పోలిస్తే, ఆస్తుల విలువ పరంగా హెచ్‌డిఎఫ్‌సి మిడ్ క్యాప్ ఫండ్, దేశంలోని అతిపెద్ద ఫండ్ అయిన పరాగ్ పారిఖ్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్‌ను అధిగమించింది. పరాగ్ పారిఖ్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ 5 సంవత్సరాల రాబడి 14.65 శాతంగా ఉండగా, హెచ్‌డిఎఫ్‌సి మిడ్ క్యాప్ ఫండ్ 5 సంవత్సరాలలో 20.69 శాతం ఆకట్టుకునే వార్షిక రాబడిని అందించింది.ఉదాహరణకు.. మీరు పరాగ్ పారిక్ ఫండ్‌లో 5 సంవత్సరాల పాటు నెలకు రూ. 10 లక్షలు పెట్టుబడి పెడితే, 14.65 శాతం రాబడి రేటుతో మీరు 5 సంవత్సరాలలో రూ.19,80,935 కూడబెట్టి ఉండేవారు. మరోవైపు, మీరు హెచ్‌డిఎఫ్‌సి మిడ్‌క్యాప్ ఫండ్‌లో 5 సంవత్సరాల పాటు రూ. 10 లక్షలను ఏకమొత్తంగా పెట్టుబడి పెడితే, 20.69 శాతం రాబడి రేటుతో, మీరు 5 సంవత్సరాలలో రూ. 25,60,687 కూడబెట్టి ఉండేవారు.

# ఖాతాదారుడు మరణిస్తే నామినీ లేకపోయినా అకౌంట్ డబ్బును నుంచి విత్‌డ్రా చేసుకోవచ్చా?




ఒక నిర్దిష్ట పరిమితిని మించి ఉంటే, బ్యాంకు అదనపు పత్రాలను అడగవచ్చు. ముఖ్యంగా చట్టబద్ధమైన వారసుల గురించి అనుమానం ఉంటే, లేదా వారసుల మధ్య వివాదం ఉంటే, తదుపరి చట్టపరమైన చర్యలు అవసరం కావచ్చు. అందువల్ల ఖాతాలో పెద్ద మొత్తం ఉన్నట్లయితే..

**ఖాతాదారుడు మరణిస్తే నామినీ లేకపోయినా అకౌంట్ డబ్బును నుంచి విత్‌డ్రా చేసుకోవచ్చా?**

ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతా తెరిచి డబ్బు జమ చేయడానికి ఆసక్తి చూపుతారు. కానీ ఖాతా తెరిచేటప్పుడు చేయవలసిన పనులన్నింటినీ చాలా మంది మర్చిపోతారు. వాటిలో అత్యంత ముఖ్యమైనది నామినీని చేర్చడం. ఖాతాదారుడు మరణించిన తర్వాత ఎవరైనా డబ్బు పొందాలంటే, తప్పనిసరిగా ఒక నామినీ ఉండాలి. కానీ నామినీ లేకపోయినా కూడా, చట్టబద్ధ వారసులు బ్యాంకు ఖాతాలోని మొత్తాన్ని క్లెయిమ్ చేసుకోవచ్చు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం, నామినీ లేదా సర్వైవర్‌షిప్ క్లాజ్ లేని ఖాతాల కోసం బ్యాంకులు ఒక సులభమైన క్లెయిమ్ విధానాన్ని పాటించాల్సి ఉంటుంది. నామినీ లేకపోవడం వల్ల ఖాతాలోని డబ్బుకు ఎలాంటి నష్టం ఉండదు. ఖాతాదారుని మరణం గురించి సంబంధిత బ్యాంకు శాఖకు తెలియజేయడం మొదటి దశ. దీని కోసం సమర్పించాల్సిన ప్రధాన పత్రం మరణ ధృవీకరణ పత్రం. ఆ తర్వాత, ఖాతాలోని మొత్తాన్ని స్వీకరించడానికి చట్టపరమైన వారసులు క్లెయిమ్ దాఖలు చేయవచ్చు. నామినేట్ చేయని ఖాతాల విషయంలో, బ్యాంకుకు అవసరమైన పత్రాలు ఖాతాలోని మొత్తం, వీలునామా ఉందా లేదా, వారసుల మధ్య వివాదం ఉందా అనే అంశాలపై ఆధారపడి ఉంటాయి.

**అవసరమైన పత్రాలు ఏమిటి?**

ఖాతాలో డబ్బును క్లెయిమ్ చేయడానికి సాధారణంగా అవసరమయ్యే ప్రధాన పత్రాలు మరణ ధృవీకరణ పత్రం, క్లెయిమ్ ఫారం, క్లెయిమ్ చేసే వ్యక్తి గుర్తింపు పత్రం, చట్టపరమైన అర్హతను నిరూపించే పత్రాలు. ఆర్‌బిఐ మార్గదర్శకాల ప్రకారం, బ్యాంకులు నిర్దిష్ట పరిమితులలోని క్లెయిమ్‌ల కోసం సరళీకృత విధానాన్ని అనుసరించవచ్చు. కొన్ని సందర్భాల్లో బ్యాంకులు ఇతర క్లెయిమ్‌దారుల నుండి నిరాకరణ, అభ్యంతరం లేని లేఖను కూడా అడగవచ్చు.

**చట్టపరమైన జుట్టు ధృవీకరణ పత్రం:**

ఖాతాదారుని చట్టబద్ధమైన వారసులు ఎవరో స్పష్టం చేయడానికి బ్యాంకు చట్టబద్ధమైన వారసుల ధృవీకరణ పత్రాన్ని అడగవచ్చు. బ్యాంకు విధానం, ఖాతాలోని మొత్తం, కేసు పరిస్థితులను బట్టి అదనపు పత్రాలు అవసరం కావచ్చు. మరణించిన వ్యక్తి వీలునామా రాసి ఉంటే, దానిలోని నిబంధనలు కూడా ముఖ్యమైనవి. అలాగే, వారసుల మధ్య వివాదం ఉంటే, సాధారణ సరళమైన క్లెయిమ్ ప్రక్రియ వర్తించకపోవచ్చు.

**మొత్తం ఎక్కువగా ఉంటే ఏమవుతుంది?**

మొత్తం ఒక నిర్దిష్ట పరిమితిని మించి ఉంటే, బ్యాంకు అదనపు పత్రాలను అడగవచ్చు. ముఖ్యంగా చట్టబద్ధమైన వారసుల గురించి అనుమానం ఉంటే, లేదా వారసుల మధ్య వివాదం ఉంటే, తదుపరి చట్టపరమైన చర్యలు అవసరం కావచ్చు. అందువల్ల ఖాతాలో పెద్ద మొత్తం ఉన్నట్లయితే, నేరుగా సంబంధిత బ్యాంకు శాఖను సంప్రదించి, అవసరమైన పత్రాల జాబితాను ముందుగా తెలుసుకోవడం మంచిది.

# ఇంట్లోనే ఎస్‌బీఐ ఈకేవైసీ చేసుకోవడం ఎలా? ఈ లింక్‌లను మాత్రం క్లిక్ చేయొద్దు!




కొన్ని సందర్భాల్లో ఎస్‌బీఐ అధికారిక కేవైసీ అప్‌డేట్ సదుపాయం ద్వారా కూడా మీ వివరాలను గుర్తించి కేవైసీ ప్రక్రియను కొనసాగించవచ్చు. ఇందులో పుట్టిన తేదీ, పాన్, సీఐఎఫ్ నంబర్ లేదా అకౌంట్ నంబర్ వంటి వివరాలతో గుర్తింపు ప్రక్రియ ఉండవచ్చు..

ఎస్‌బీఐ ఖాతాదారులు తమ KYC (Know Your Customer) వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవడం అవసరం. ప్రస్తుతం ఉన్న ఖాతాకు Re-KYC అవసరమైతే, బ్యాంక్ బ్రాంచ్‌కు వెళ్లకుండానే అధికారిక ఆన్‌లైన్ మార్గాల్లో ప్రక్రియను పూర్తి చేసే అవకాశం ఉంటుంది. అయితే కేవైసీ పేరుతో వచ్చే నకిలీ ఐామీలు, వాట్సాప్ మెసేజ్‌ల విషయంలో ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలి. తెలియని లింకులపై క్లిక్ చేయకుండా స్వయంగా ఎస్‌బీఐ అధికారిక యాప్ లేదా వెబ్‌సైట్‌ను మాత్రమే ఉపయోగించడం సురక్షితమని ఎస్‌బీఐ సూచిస్తోంది.

YONO SBI ద్వారా Re-KYC ఎలా చేసుకోవాలి?

ఎస్‌బీఐ అధికారిక సూచనల ప్రకారం YONO SBI యాప్ ద్వారా కేవైసీ అప్‌డేట్ చేసుకోవడానికి ఈ విధానాన్ని అనుసరించవచ్చు.

1YONO SBI యాప్ ఓపెన్ చేయండి: మీ మొబైల్‌లో అధికారిక యోనో ఎస్‌బీఐ యాప్‌ను ఓపెన్ చేసి మీ పీ×చీ లేదా అవసరమైన లాగిన్ వివరాలతో సైన్ ఇన్ చేయండి.

Service Requestలోకి వెళ్లండి: లాగిన్ అయిన తర్వాత Service Request ఆప్షన్‌ను ఎంచుకోండి.

అందుబాటులో ఉన్న ఆప్షన్లలో కేవైసీ అప్‌డేట్ కేవైసీ అనే ఆప్షన్‌ను ఎంచుకోండి.

అవసరమైన వివరాలు ఇవ్వండి: అవసరమైతే MT Internet Banking profile passwordqT నమోదు చేసి, స్క్రీన్‌పై కనిపించే కేవైసీ వివరాలను పరిశీలించండి. మార్పులు ఉంటే వాటిని అప్‌డేట్ చేయాలి.

అవసరమైన పత్రాలు సమర్పించండి: మీ కేవైసీలో ఏ వివరాలను మార్చుతున్నారనే దానిపై ఆధారపడి సంబంధిత పత్రాలను సమర్పించాల్సి రావచ్చు.

OTPÔÃ ధృవీకరించండి: వివరాలను పరిశీలించిన తర్వాత రిక్వెస్ట్‌ను సబ్మిట్ చేసి, రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు వచ్చే ద్వారాతో వెరిఫికేషన్ పూర్తి చేయాలి.

ఎస్‌బీఐ పరిశీలన తర్వాత కేవైసీ అప్‌డేట్: మీరు సమర్పించిన వివరాలను బ్యాంక్ పరిశీలించిన తర్వాత ఖ్జ రికార్డుల్లో అప్‌డేట్ చేస్తుంది.

ఎస్‌బీఐ కేవైసీ అప్‌డేట్ పేజీ ద్వారా కూడా..

కొన్ని సందర్భాల్లో ఎస్‌బీఐ అధికారిక కేవైసీ అప్‌డేట్ సదుపాయం ద్వారా కూడా మీ వివరాలను గుర్తించి కేవైసీ ప్రక్రియను కొనసాగించవచ్చు. ఇందులో పుట్టిన తేదీ, పాన్, సీఐఎఫ్ నంబర్ లేదా అకౌంట్ నంబర్ వంటి వివరాలతో గుర్తింపు ప్రక్రియ ఉండవచ్చు.

ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా..

ఎస్‌బీఐ ఇంటర్నెట్ బ్యాంకింగ్‌ను ఉపయోగించే రిటైల్ కస్టమర్లు అధికారిక ఇంటర్నెట్ బ్యాంకింగ్ పోర్టల్‌లోకి లాగిన్ అయి KYC లేదా KYC Updatవకు సంబంధించిన ఆప్షన్ కోసం చూడవచ్చు. సాధారణంగా కేవైసీ కోసం అడిగే పత్రాలను సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.:

KYC కోసం ఏ పత్రాలు అవసరం?

KYCలో ఏ వివరాలను అప్‌డేట్ చేస్తున్నారనే దానిపై పత్రాల అవసరం ఆధారపడి ఉంటుంది. పత్రాల్లో పాస్‌పోర్ట్, ఓటర్ ID, డ్రైవింగ్ లైసెన్స్ వంటి అధికారిక పత్రాలు ఉన్నాయి.

మోసాల విషయంలో జాగ్రత్త:

మీకు »»Your SBI KYC will expire---click this linkµµ, »»KYC update immediatelyµµ వంటి మెసేజ్‌లు ఐామీ లేదా WhatsApp ద్వారా వచ్చినా ఎట్టి పరిస్థితుల్లో స్పందించవద్దని ఎస్‌బీఐ హెచ్చరిస్తోంది. అలాగే తెలియని లింక్‌పై క్లిక్ చేయవద్దు. ఆ లింక్ ద్వారా మీ SBI లాగిన్ వివరాలు, OTP, కార్డు వివరాలు లేదా ఇతర బ్యాంకింగ్ సమాచారం దొంగిలించే అవకాశం ఉంటుంది.

KYC అప్‌డేట్ చేయాల్సి ఉంటే:

YONO SBI యాప్‌ను మీరే ఓపెన్ చేయండి.

SBI అధికారిక వెబ్‌సైట్‌ను స్వయంగా యాక్సెస్ చేయండి.

# అమెజాన్, స్విగ్గీ, ఇన్‌స్టామార్ట్ కేంద్రాలకు బిగ్ షాక్ కోట్ల విలువైన ఎక్స్‌పైరీ ఫుడ్ సీజ్!



కర్ణాటక రాజధాని బెంగళూరులో ఆహార భద్రతా అధికారులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో భారీగా గడువు ముగిసిన, సరైన లేబులింగ్ లేని ఆహార ఉత్పత్తులు బయటపడ్డాయి. అమెజాన్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌తో పాటు పలు ఆహార నిల్వ, సరఫరా కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించిన అధికారులు మొత్తం రూ.1.38 కోట్ల విలువైన ఆహార ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బెంగళూరు: కర్ణాటక రాజధాని బెంగళూరులో ఆహార భద్రతా అధికారులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో భారీగా గడువు ముగిసిన, సరైన లేబులింగ్ లేని ఆహార ఉత్పత్తులు బయటపడ్డాయి. అమెజాన్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌తో పాటు పలు ఆహార నిల్వ, సరఫరా కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించిన అధికారులు మొత్తం రూ.1.38 కోట్ల విలువైన ఆహార ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటితో పాటు అవసరమైన లైసెన్సులు లేకుండా నిల్వ చేసినట్లు గుర్తించిన సుమారు రూ.4.02 లక్షల విలువైన మందులను కూడా స్వాధీనం చేసుకున్నారు.

కర్ణాటక ఆహార భద్రత, ఔషధాల పరిపాలన సంస్థ అధికారులు దేవనహళ్లి, అనేకల్‌లోని అమెజాన్ కేంద్రాలతో పాటు హోస్కోట్‌లోని స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ కేంద్రం, బెంగళూరు పరిసర ప్రాంతాల్లోని ఇతర గిడ్డంగులు, సరఫరా కేంద్రాల్లో తనిఖీలు చేపట్టారు. దేవనహళ్లిలోని అమెజాన్ కేంద్రంలో లేబులింగ్ నిబంధనలకు అనుగుణంగా లేని రూ.14 లక్షల విలువైన ఆహార ఉత్పత్తులతో పాటు రూ.10 లక్షల విలువైన గడువు ముగిసిన ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. అదే కేంద్రం నుంచి రూ.2.45 లక్షల విలువైన మందులను కూడా స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

అనేకల్ అమెజాన్ కేంద్రంలో రూ.19 లక్షల విలువైన సరైన లేబులింగ్ లేని ఆహార ఉత్పత్తులు, రూ.13 లక్షల విలువైన గడువు ముగిసిన ఉత్పత్తులు బయటపడ్డాయి. అక్కడి నుంచి రూ.1.57 లక్షల విలువైన మందులను స్వాధీనం చేసుకున్నారు. హోస్కోట్‌లోని స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ కేంద్రంలో రూ.42 లక్షల విలువైన గడువు ముగిసిన ఆహార ఉత్పత్తులు గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. అక్కడ అపరిశుభ్రమైన పరిస్థితులు ఉన్నట్లు గుర్తించి కేంద్రాన్ని మూసివేశారు. దర్యాప్తు కొనసాగుతుండగా మరిన్ని ఉత్పత్తులు గుర్తించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఇదే తనిఖీల్లో హెచ్‌బీఆర్ లేఅవుట్‌లోని సప్త బజార్, లింగరాజపురంలోని లియో 7 ఎంటర్‌ప్రైజెస్ తదితర ప్రాంతాల్లోనూ అధికారులు తనిఖీలు చేశారు. గడువు ముగిసిన బిస్కెట్లు, రాగి పిండి, చికెన్ ప్యాటీ, పనీర్, కుకీలు, నట్స్, గుడ్లు, పిండి తదితర ఆహార పదార్థాలను గుర్తించారు. మొత్తంగా రూ.33 లక్షల విలువైన తప్పుడు, లేబులింగ్ సరిగాలేని ఉత్పత్తులు, రూ.1.05 కోట్ల విలువైన గడువు ముగిసిన, గడువు సమీపించిన ఆహార ఉత్పత్తులు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. మందులతో కలిపి మొత్తం స్వాధీనం విలువ రూ.1.43 కోట్లకు చేరింది. ఆన్‌లైన్ డెలివరీ, ఈ-కామర్స్ సంస్థల ద్వారా వినియోగదారులకు చేరే ఆహార పదార్థాల నాణ్యతపై ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఈ తనిఖీలకు ప్రాధాన్యం ఏర్పడింది. ఉల్లంఘనలు గుర్తించిన సంస్థలకు నోటీసులు జారీ చేసి, ఆహార భద్రతా చట్టం ప్రకారం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# పసిడిపురి తెలుగు రాష్ట్రాల్లో అతి తక్కువ ధరకు బంగారం ఎక్కడ దొరుకుతుందో తెలుసా..?




తెలుగు రాష్ట్రాల్లో బంగారం కొనుగోలుకు ప్రసిద్ధి చెందిన ప్రాంతాల్లో ప్రొద్దుటూరుకు ప్రత్యేక స్థానం ఉంది. హైదరాబాద్, విజయవాడ వంటి నగరాలతో పోలిస్తే ఇక్కడ బంగారం ధర, తరుగు, మేకింగ్ ఛార్జీల్లో వ్యత్యాసం ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు. భారీ మొత్తంలో ఆభరణాలు కొనుగోలు చేసేవారు ఇతర రాష్ట్రాల నుంచి కూడా ప్రొద్దుటూరుకు వస్తుంటారు. మహిళలు ఆభరణాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. బంగారం, వెండి లాంటివి కొనేందుకు ఇష్టపడతారు. అయితే.. ఇప్పుడున్న పరిస్థితులలో బంగారం కొనాలి అంటే భూములు అమ్ముకోవాల్సిందే.. ఎందుకంటే.. గోల్డ్ ధరలు విపరీతంగా పెరిగాయి.. బంగారం ధరలు చూసి సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు. అలాంటిది తెలుగు రాష్ట్రాలలో హైదరాబాద్, విజయవాడ లాంటి ప్రాంతాల కంటే అతి తక్కువ బంగారం రేట్లు ఉన్న ప్రాంతం మరొకటి ఉంది.. అదేంటో మీకు తెలుసా..? తెలియకపోతే ఈ పసిడి నగరానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను తెలుసుకోండి.. కడప జిల్లాలో పసిడిపురిగా పిలవబడే ప్రాంతం ప్రొద్దుటూరు.. బంగారం వ్యాపారంలో బొంబాయి తర్వాత అంతటి వ్యాపారాన్ని చేసే ప్రాంతంగా పిలుస్తారు.. అందుకే.. రెండవ బొంబాయిగా పిలిచే ప్రొద్దుటూరు నగరం బంగారం వ్యాపారానికి ప్రసిద్ధి చెందింది. బులియన్ రేట్లలో హైదరాబాద్, బొంబాయి, ఢిల్లీ , విజయవాడలతో పాటు ప్రొద్దుటూరు బులియన్ కూడా ప్రతిరోజు అందరూ పరిశీలిస్తూ ఉంటారు. సాధారణంగా పెద్దపెద్ద జ్యువెలరీ షాపులలో ఉండే డిస్కౌంట్ కంటే ప్రొద్దుటూరులో బంగారు ఆభరణాలు కొంటే తులంపై 6 నుంచి 7 వేల వరకు వ్యత్యాసం ఉంటుంది. అందుకే శుభకార్యాలు ఏమైనా ఉంటే.. చుట్టుపక్కనున్న జిల్లాలే కాకుండా తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు వంటి రాష్ట్రాల నుంచి కూడా వచ్చి ప్రొద్దుటూరులో బంగారు ఆభరణాలను కొంటూ ఉంటారు. చిన్నచిన్న ఆభరణాలకు రారు.. కానీ ఎక్కువ మొత్తంలో ఆభరణాలు కొనాలి అంటే మాత్రం ఖచ్చితంగా సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చి బంగారాన్ని కొనుగోలు చేస్తారు అంటే అతిశయోక్తి కాదు.. తులంపై ఆరేడు వేలు కలిసి వస్తుంది.. అందుకే ప్రొద్దుటూరులో బంగారం కొనుగోలుకు చాలామంది మక్కువ చూపుతారు. ఈ రోజు జువెలరీ షాపులలో 22 క్యారెట్ల బంగారం ధర 1,41,900 ఉంటే ప్రొద్దుటూరులో అదే 22 క్యారెట్ల బంగారం ధర 1,36,320 ఉంది అంటే ఈ రోజే దాదాపు 5500 వ్యత్యాసం కనబడుతుంది. అంతేకాకుండా ప్రొద్దుటూరులో పెద్దపెద్ద జ్యువెలరీ షాపులలో దొరికే మోడల్స్ ను హ్యాండ్ మేడ్ తో తయారు చేసి ఇస్తారు. అంతటి నైపుణ్యం ఉన్న కళాకారులు ప్రొద్దుటూరులో ఉన్నారు. అందుకే ప్రొద్దుటూరు బంగారానికి ధర తక్కువ మన్నిక ఎక్కువ అంటారు. అంతేకాకుండా తరుగు విషయంలో కూడా జువెలరీ షాపుల కంటే ఇక్కడ తక్కువగానే ఉంటుంది. మేకింగ్ ఛార్జ్ కూడా తక్కువగానే తీసుకుంటారని వ్యాపారులు చెబుతున్నారు.

# హెచ్‌డీఎఫ్‌సీ కస్టమర్లకు శుభవార్త అదేంటో తెలుసా..?




ఎంసీఎల్‌ఆర్ అంటే కనీస రుణ రేటు. దీనిని 2016లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) ప్రవేశపెట్టింది. ఈ నిబంధనతో ముడిపడి ఉన్న రుణాల వడ్డీ రేట్లు, వడ్డీ రేటులో మార్పుకు అనుగుణంగా పెరుగుతూ తగ్గుతూ ఉంటాయి. అలాగే బ్యాంకు..

HDFC బ్యాంక్ తన వినియోగదారులకు ఒక శుభవార్తను ప్రకటించింది. అదేమిటంటే తన వీజూ= (మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్-బేస్డ్ లెండింగ్ రేట్స్) ను 10 బేసిస్ పాయింట్లు తగ్గించింది. వీజూ= ఆధారంగా రుణాలు తీసుకున్న వారికి ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ సవరించిన వడ్డీ రేటు సెప్టెంబర్ 07, 2026 నుండి అమల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో హెచ్‌డీఎప్‌సీ బ్యాంక్ చేసిన ఈ ముఖ్యమైన మార్పును తెలుసుకుందాం.

HDFC బ్యాంక్ MCLR శాతాన్ని తగ్గించింది:

బేసిస్ పాయింట్ అనేది శాతంలో ఒక భాగం. అంటే 100 బేసిస్ పాయింట్లు కలిపితే ఒక శాతం అవుతుంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వడ్డీ రేట్లలో మార్పు కారణంగా ప్రస్తుత ఎంసీఎల్‌ఆర్ వడ్డీ రేటు 7.90 శాతం నుండి 8.60 శాతానికి పెరిగింది. ఇది ఇంతకుముందు 8 శాతం నుండి 8.65 శాతంగా ఉండేది.

MCLR అంటే ఏమిటి?

MCLR అంటే మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్-బేస్డ్ లెండింగ్ రేట్. అనేది ఒక బ్యాంకు రుణంపై వసూలు చేయగల కనీస రేటు. ఇది వడ్డీ రేట్లకు ఒక దిగువ పరిమితిని నిర్దేశిస్తుంది. తద్వారా ఆర్‌బిఐ ఆమోదం పొందితే తప్ప, రుణగ్రహీతల నుండి ఒక నిర్దిష్ట పరిమితి కంటే తక్కువ రేట్లు వసూలు చేయకుండా ఇది నిర్ధారిస్తుంది.

బ్యాంక్ సెప్టెంబర్ MCLR రేటు:

హెచ్‌డీఎఫ్‌సీ ఒక నెల MCLR రేటును 8 శాతం నుండి 7.90 శాతానికి తగ్గించారు.

మూడు నెలల కాలానికి ఎంసీఎల్‌ఆర్ రేటు 8.15 శాతం నుంచి 8.05 శాతానికి తగ్గింది.

ఆరు నెలల కాలంలో ఎంసీఎల్‌ఆర్ రేటు 8.30 శాతం నుంచి 8.25 శాతానికి తగ్గింది.

ఒక సంవత్సరపు వీజూ= రేటు 8.40 శాతం నుంచి 8.35 శాతానికి తగ్గింది.

రెండు సంవత్సరాల కాలానికి ఎంసీఎల్‌ఆర్ రేటు 8.55 శాతం నుంచి 8.45 శాతానికి తగ్గింది.

మూడేళ్ల కాలపరిమితికి ఎంసీఎల్‌ఆర్ రేటు 8.65 శాతం నుంచి 8.60 శాతానికి తగ్గింది.

MCLR అంటే ఏమిటి?

ఎంసీఎల్‌ఆర్ అంటే కనీస రుణ రేటు. దీనిని 2016లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) ప్రవేశపెట్టింది. ఈ నిబంధనతో ముడిపడి ఉన్న రుణాల వడ్డీ రేట్లు, వడ్డీ రేటులో మార్పుకు అనుగుణంగా పెరుగుతూ తగ్గుతూ ఉంటాయి.

# రోగ నిరోధక వ్యవస్థ.. అపోహలు-నిజాలు

**అపోహ: విటమిన్ సి తీసుకుంటే జలుబు తగ్గుతుంది.**



**వాస్తవం:** విటమిన్ సి రోగ నిరోధక వ్యవస్థ (ఇమ్యూనిటీ) పనితీరుకు అండగా నిలుస్తుంది. కానీ, ఆరోగ్యవంతులైన పెద్దల్లో సాధారణ జలుబును నివారించలేదని అధ్యయనాలు తెలుపుతున్నాయి. విటమిన్ సి లోపం రోగ నిరోధక వ్యవస్థను బలహీనపర్చవచ్చు కానీ, సప్లిమెంట్లు తీసుకున్నంత మాత్రాన వైరల్ ఇన్ఫెక్షన్లను అడ్డుకోలేదు. అయినప్పటికీ, కొన్ని పరిశోధనల ప్రకారం జలుబుగా ఉన్నప్పుడు రోజుకు 2 గ్రాముల విటమిన్ సి తీసుకుంటే దాని తీవ్రత 20 శాతం వరకు తగ్గించగలదు. కాబట్టి, నివారణ చర్యగా ముందుగా తీసుకునే కంటే జబ్బుగా ఉన్నప్పుడు విటమిన్ సి తీసుకుంటే మరింత ప్రభావం చూపుతుంది.

**అపోహ:** పరిశుభ్రత (హైజీన్) రోగ నిరోధక వ్యవస్థను బలహీన పరుస్తుంది.

వాస్తవం: మన శరీరం లోపల, శరీరంపై ఉండే సూక్ష్మజీవుల సమూహంలో మార్పులకు అలర్జీతో వచ్చే వ్యాధులు పెరగడానికి లంకె ఉంటుంది. మంచి బ్యాక్టీరియాను పోషించుకోవడం అత్యవసరం. అయితే, అతిసారం, న్యుమోనియా వంటి హానికరమైన ఇన్ఫెక్షన్ల నుంచి కాపాడుకోవడానికి చేతులు కడుక్కోవడం, నాణ్యమైన ఆహారం తినడం లాంటి పరిశుభ్రతకు సంబంధించిన అలవాట్లు పాటించాల్సిందే. అలాగని అతికి పోకుండా కనీస శుభ్రత పాటించడం మాత్రం మర్చిపోకండి.

**అపోహ:** టీకాల కంటే సహజ రోగ నిరోధకతే మంచిది.

వాస్తవం: ఇన్ఫెక్షన్ సోకిన తర్వాతనే శరీరంలో సహజ నిరోధకత అభివృద్ధి చెందుతుంది. అయితే సహజ నిరోధకత కొన్ని ఇబ్బందులతో వస్తుంది. పైగా ఒక వ్యక్తి నుంచి మరో వ్యక్తికి వేర్వేరుగా ఉంటుంది. అధ్యయనాల ప్రకారం టీకాలు వ్యాధుల ప్రమాదం లేకుండా బలమైన, లక్షిత రోగ నిరోధకతను అందిస్తాయి. కాబట్టి, ఇన్ఫెక్షన్ మీద ఆధారపడటం కంటే టీకాలతో సురక్షితమైన, నమ్మకమైన ఇమ్యూనిటీని సమకూర్చుకోవచ్చు.

**అపోహ:** వయసు పెరుగుతుంటే రోగ నిరోధకత తగ్గుతుంది.

వాస్తవం: రోగ నిరోధకత అన్నిసార్లూ వయసుతోపాటు తగ్గిపోదు. వయసుతోపాటు ఇమ్యూనిటీ వైఫల్యానికి కారణమయ్యే ఇమ్యునోసెనెసెన్స్ కారణంగా కొత్త ఇన్ఫెక్షన్లకు వ్యతిరేకంగా ప్రతిస్పందించే సామర్థ్యం తగ్గొచ్చు. కానీ, పెద్దలు పాత ఇన్ఫెక్షన్లు, టీకాల కారణంగా అభివృద్ధి చెందిన జ్ఞప్తి కణాలను (మెమరీ సెల్స్) నిలిపి ఉంచుకోగలరు. అలా ఇవి గతంలో పోరాడిన రోగ కారక క్రిములకు వ్యతిరేకంగా రక్షణ కల్పిస్తాయి.

# రోజుకు అసలు ఎన్ని కోడిగుడ్లను తింటే మంచిది..?



మనం ఆరోగ్యంగా ఉండాలంటే అందుకు ఆరోగ్యకరమైన ఆహారాలను తినాల్సి ఉంటుందన్న విషయం అందరికీ తెలిసిందే. కానీ నేటి ఉరుకుల పరుగుల బిజీ యుగంలో చాలా మంది జంక్ ఫుడ్‌కు అలవాటు పడ్డారు. ఉదయం బ్రేక్‌ఫాస్ట్ మొదలుకొని రాత్రి తినే డిన్నర్ వరకు జంక్ ఫుడ్‌నే ఎక్కువగా తింటున్నారు. అలాగే వేళ తప్పించి భోజనం చేస్తున్నారు. రాత్రి పూట కూడా ఆలస్యంగా ఆహారం తీసుకుంటున్నారు. ఇదంతా అస్తవ్యస్తమైన జీవనశైలి కిందకు వస్తుంది. దీంతో ఆరోగ్య సమస్యలను చేజేతులా కొని తెచ్చుకుంటున్నారు. అందుకనే ఆరోగ్యవంతమైన ఆహారాలను తినాలని పోషకాహార నిపుణులతోపాటు ఆరోగ్య నిపుణులు కూడా మనకు సూచిస్తుంటారు. ఇక ఆరోగ్యవంతమైన ఆహారాల విషయానికి వస్తే కోడిగుడ్లు ముఖ్య పాత్ర పోషిస్తాయని చెప్పవచ్చు.

## ప్రోటీన్లు అధికం..

రోజుకు కనీసం ఒక కోడిగుడ్డును ఉడకబెట్టి తింటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు. కోడిగుడ్లలో ప్రోటీన్లు అధిక మొత్తంలో ఉంటాయి. ఒక కోడిగుడ్డును తింటే మనకు సుమారుగా 6 గ్రాముల మేర ప్రోటీన్లు లభిస్తాయి. ఇవి కండరాలకు శక్తిని, పోషణను అందిస్తాయి. దీంతో మనం చురుగ్గా ఉంటాం. ఉత్సాహంగా పనిచేస్తాం. ఉదయం బ్రేక్‌ఫాస్ట్ రూపంలో కోడిగుడ్డును తింటే రోజంతా యాక్టివ్‌గా ఉండవచ్చు. ఎంత పనిచేసినా అలసిపోకుండా ఉంటారు. అలాగే కోడిగుడ్లలో కోలిన్ అనే పోషక పదార్థం సమృద్ధిగా ఉంటుంది. ఇది కణాల పనితీరుకు సహకరిస్తుంది. లివర్ పనితీరును మెరుగు పరుస్తుంది. శరీరంలోని కొలెస్ట్రాల్‌ను నియంత్రిస్తుంది. కోలిన్ వల్ల శరీరంలో అసిటైల్ కోలిన్ ఉత్పత్తి అవుతుంది. ఇది మన మెదడు పనితీరుకు, జ్ఞాపకశక్తికి, ఏకాగ్రతకు, కండరాల పనితీరుకు ఎంతగానో సహాయ పడుతుంది. కనుక కోడిగుడ్లను తింటే మెదడును యాక్టివ్ గా ఉంచుకోవచ్చు.

## కంటి చూపు మెరుగు పడుతుంది..

కోడిగుడ్లలో యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఎక్కువగానే ఉంటాయి. ముఖ్యంగా లుటీన్, జియాజాంతిన్ అనే యాంటీ ఆక్సిడెంట్లు గుడ్లలో సమృద్ధిగా ఉంటాయి. ఇవి కళ్లను సూర్యుని నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాల బారి నుంచి రక్షిస్తాయి. దీంతో కళ్లలో శుక్లాలు రాకుండా చూసుకోవచ్చు. వయస్సు మీద పడడం వల్ల కంటి చూపు తగ్గడం అనే సమస్య వస్తుంది. దీన్ని కూడా రాకుండా నివారించవచ్చు. కోడిగుడ్లలో సెలీనియం అధిక మొత్తంలో ఉంటుంది. ఇది శరీర రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. దీంతో సీజనల్ వ్యాధుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇలా కోడిగుడ్లను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

## ఎన్ని గుడ్లను తినాలి..?

ఇక కోడిగుడ్లను రోజుకు ఎన్ని తినాలి.. అని చాలా మంది సందేహం వ్యక్తం చేస్తుంటారు. ఇందుకు నిపుణులు ఏమని సమాధానం చెబుతున్నారంటే.. ఆరోగ్యవంతమైన వ్యక్తులు రోజుకు 1 నుంచి 2 కోడిగుడ్లను ఉడకబెట్టి తినవచ్చు. గుండె జబ్బులు ఉన్నవారు, కొలెస్ట్రాల్ సమస్య ఉన్నవారు డాక్టర్ సలహా మేరకు గుడ్లను తినాలి. వీరు కోడిగుడ్డు తెల్లసొన మాత్రమే తినాలి. అలాగే శారీరక శ్రమ లేదా వ్యాయామం ఎక్కువగా చేసేవారు రోజుకు 2 నుంచి 4 కోడిగుడ్లను తినవచ్చు. ఇలా కోడిగుడ్లను తింటే అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉండవచ్చు.

# ఫిబ్రవరిలో వైట్‌హౌజ్‌కు మోదీ: డోనాల్డ్ ట్రంప్



ప్రధాని మోదీ అమెరికా పర్యటనకు వెళ్లే అవకాశాలు ఉన్నాయి. ఫిబ్రవరిలో మోదీ వైట్‌హౌజ్‌ను విజిట్ చేయనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. దేశాధ్యక్షుడిగా రెండో సారి ఎన్నికైన ట్రంప్‌తో.. సోమవారం ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడారు. ఆ ఫోన్ సంభాషణ గురించి ట్రంప్ వెల్లడించారు. ఫ్లోరిడాలోని జాయింట్ బేస్ ఆండ్రూస్ నుంచి ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో వెళ్తున్న సమయంలో ట్రంప్ రిపోర్టర్లతో మాట్లాడారు. భారత ప్రధాని మోదీతో ఫోన్‌లో మాట్లాడనని, ఆయన వైట్‌హౌజ్‌కు రానున్నారని, బహుశా ఫిబ్రవరిలో ఆయన శ్వేతసౌధాన్ని విజిట్ చేసే ఛాన్సు ఉన్నట్లు తెలిపారు. ఇండియాతో తమకు మంచి రిలేషన్ ఉందని ట్రంప్ పేర్కొన్నారు. మోదీతో ఫోన్‌లో అన్ని అంశాల గురించి చర్చించినట్లు తెలిపారు. తొలి సారి దేశాధ్యక్షుడిగా చేసిన సమయంలో.. ట్రంప్ తన చివరి పర్యటన ఇండియాకే వచ్చారు. ఆ ఇద్దరి మధ్య మంచి రిలేషన్ ఉన్నది. 2019లో హూస్టన్‌లో జరిగిన ర్యాలీలో.. 2020 ఫిబ్రవరిలో అహ్మదాబాద్‌లో జరిగిన ర్యాలీలో ఇద్దరూ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

# తన చిత్రాల రూపంలో.. శాంతినికేతన్‌ను హైదరాబాద్‌కు తెచ్చిన కొండపల్లి శేషగిరిరావు





నేడు కొండపల్లి శేషగిరిరావు శత జయంతి

విశ్వకవి రవీంద్రనాథ్ టాగోర్ 1933లో హైదరాబాద్ వచ్చారు. తాను 1901లో స్థాపించిన శాంతినికేతన్ (విశ్వభారతి) ఒడిదుడుకులలో ఉన్నది. నిర్వహణకు అవసరమైన నిధులు ఇప్పిస్తానని నిజాం కార్యనిర్వాహక మండలి సభ్యుడు నవాజ్ మెహదీ నవాబ్ జంగ్ హామీ ఇస్తూ ఆహ్వానించినందుకు హైదరాబాద్ వచ్చారు. నిజాం రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. ఆ సందర్భంగా ఇప్పటి బంజారాహిల్స్ ప్రాంతంలో జంగ్ అతిథి గృహంలో రవీంద్రుడు కొద్ది రోజులున్నారు. ఆ పరిసరాలకు ముగ్ధుడైన రవీంద్రుడుబీ ముందే వచ్చి ఉంటే ఇక్కడే శాంతినికేతన్ స్థాపించేవాడిని అని జంగ్‌తో అన్నారు. రవీంద్రుడు శాంతినికేతన్‌ను హైదరాబాద్‌లో స్థాపించలేకపోయారు కానీ, శాంతినికేతన్‌ను కొండపల్లి శేషగిరిరావు హైదరాబాద్‌కు తెచ్చారు తన చిత్రాల రూపంలో! కొండపల్లి హృదయమూ, వారు భావితరాల కోసం పదిలపరిచిన చిత్రాలు శాంతి నికేతనాలే!

'సరస రేఖా చిత్ర
సాహిత్యమును గూర్చిన
నీదు కుంచియకు
అభివాదమయ్యా,
అప్సరసల భువిని
అవతరింపగజేయు మాంత్రికా నీకు నమస్సులయ్యా..'

దాశరథి కృష్ణమాచార్య పద్య పాదాలతో కొండపల్లికి సుమాంజలి॥

పాత వరంగల్ జిల్లా, మానుకోట (మహబూబాద్) దగ్గరలోని పెనుగొండలో 1924, జనవరి 27న కొండపల్లి జన్మించారు. బొమ్మలు వేయ దం పుట్టుకతో వచ్చిన అభిరుచి. రామప్ప శిల్పాలు, పాకాల పరిసరాలు స్కెచెస్‌గా వేసేవారు. పెన్సిల్-పేపర్‌తో హైదరాబాద్ వచ్చారు. ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో పెయింటింగ్స్ నేర్చారు. రవీంద్రుడి మిత్రుడు మెహదీ నవాజ్‌జంగ్ కొండపల్లి చిత్రాలకు ముగ్ధుడై శాంతినికేతన్‌లో చేరేందుకు తోడ్పడ్డారు. ప్రపంచ నగరాల్లో నవ వధువుగా ప్రఖ్యాతిచెందిన హైదరాబాద్ కొండపల్లి శాంతినికేతన్ వెళ్లేప్పుడు ప్రశాంతంగా ఉన్నది. రైల్లో తిరిగి వచ్చే సందర్భంలో శ్రీవైష్ణవుడైన కొండపల్లికి రజాకార్ల దుష్కృత్యాలు 1948లో అనుభవంలోకి వచ్చా యి. ఒక సహ ప్రయాణికుడు 'ఎవరనుకున్నావు? నవాజ్‌జంగ్ స్నేహితుడు' అనడంతో ఆపద తప్పింది. స్వతహాగా గాంధేయవాది అయిన కొండపల్లిపై రావి నారాయణరెడ్డి, వట్టికోట, దాశరథి, కాళోజీ తదితరుల ప్రభావం పడింది. కొండపల్లి జల-తైల వర్ణాల్లో సామ్యవాద ఛాయలూ కనిపిస్తాయి. తాను చదివిన ఫైన్ ఆర్ట్స్ కళాశాలలోనే అధ్యాపకులుగా పనిచేశారు. ఎందరో చిత్రకారులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా స్ఫూర్తినిచ్చిన కొండపల్లి తన చిత్రాల ద్వారా గాడ్స్ పెయింటర్ అనే ప్రశస్తి పొందారు. ఆంధ్ర దేశంలో చిత్రకళ-తెలంగాణలో చిత్రకళ, కళ-కల్పనా వైచిత్రి వంటి రచనలు చేశారు. జానపద చిత్రకళను పరిచయం చేస్తూ పరిశోధనాత్మక వ్యాసాలు రాశారు. తెలుపు-నలుపు చిత్రాలు, మ్యూరల్స్ ఎన్నింటినో చిత్రించారు. అసంఖ్యాక అవార్డులు పొందారు. ఎమరిటస్ మేడం పుకు అకినో, బిశ్వనాథ్ ముఖర్జీ, ఎ.ఎస్.రామన్, పీటర్ స్విజ్, ఎన్.ఎస్.బింద్రే, అనితారాయ్ చౌదరి, వై.వి.శుక్ల, ఎ.పెరుమాళ్ వంటి ఎందరో ప్రముఖులు వీరిని అభిమానించేవారు. హైస్కూల్ విద్యార్థి దశలో నేను కొన్న తొలి పత్రిక ఆంధ్రపత్రిక వీక్లీ. లైబ్రరీలో (1969-70) ఆ పత్రికను చూశాను. ముఖచిత్రం పోతన. ఆ సుకవి అక్షరాలు చిత్రరూపం ధరిస్తే అవి కొండపల్లి శేషగిరిరావు బొమ్మలే! కొండపల్లితో తొలి పరిచయం 1994లో. అదీ చిత్రంగా జరిగింది. ఉదయం పొలిటికల్ బ్యూరో రిపోర్టర్‌గా 1992లో హైదరాబాద్ వచ్చాను. రాంనగర్ వాసినయ్యాను. మనింటి దగ్గరలోనే ఉంటారని మిత్రులు లక్ష్మణరావు జి.కృష్ణకు నన్ను పరిచయం చేస్తున్నారు. మాటల్లో మాటగా గుఱ్ఱం మల్లయ్య (1904-1984)కు బంధువు అని అన్నారు. అది రాశాడు, ఇది రాశాడు అని సోది చెబుతావేం? ఫలానా వారితో బంధుత్వం ఉన్నవాడు అనే ముక్క చెప్పకుండా! అన్నారు జి.కృష్ణ. వారిపై నేనొక వ్యాసం రాస్తాను, రేపు ఉదయం మీ ఇంటికి వస్తానన్నారు జి.కృష్ణ. మరుసటి ఉదయం నిద్ర లేవకముందే తలుపు తట్టారు. చేతిలో నోట్‌బుక్, పెన్ను! గుఱ్ఱం మల్లయ్య వాటర్ కలర్ పెయింటింగ్స్ వరదకు తడిచి శిథిలావస్థలో ఉన్నాయని చెప్పినపుడు కలవరం చెందారు. ప్రదర్శిద్దాం, నా వంతు చేయి వేస్తానన్నారు, సిగ్గనిపించింది. రెండేండ్ల తర్వాత పీఎఫ్ అడ్వాన్స్ లోన్ తీసుకొని పెయింటింగ్స్ ఫ్రేమ్ చేయించి కృష్ణకు చూపించాను. ఎవరిని పిలుద్దామని అడిగాను. ఇంకెవరు కొండపల్లి శేషగిరిరావునే అన్నారు. ఆ సందర్భంగా కొండపల్లి నివాసంలో శాంతినికేతన్ చూశాను. "స్వతహాగా గాంధేయవాది అయిన కొండపల్లిపై రావి నారాయణరెడ్డి, వట్టికోట, దాశరథి, కాళోజీ తదితరుల ప్రభావం పడింది. కొండపల్లి జల-తైల వర్ణాల్లో సామ్యవాద ఛాయలూ కనిపిస్తాయి. తాను చదివిన ఫైన్ ఆర్ట్స్ కళాశాలలోనే అధ్యాపకులుగా పనిచేశారు. ఎందరో చిత్రకారులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా స్ఫూర్తినిచ్చిన కొండపల్లి తన చిత్రాల ద్వారా గాడ్స్ పెయింటర్ అనే ప్రశస్తి పొందారు." బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 1994 ఆగస్టు 9న గుఱ్ఱం మల్లయ్య పెయింటింగ్స్ మూడు రోజుల ఎగ్జిబిషన్ ప్రారంభించారు కొండపల్లి. ఆ సమావేశంలో జి.కృష్ణ, రాంభట్ల కృష్ణమూర్తి, దరువూరి వీరయ్యలు కూడా ప్రసంగించారు. శాంతినికేతన్‌లో తనకు సీనియర్ అయిన గుఱ్ఱం మల్లయ్య, వారికి సీనియర్ అయిన మైసూర్ సంస్థానం చిత్రకారుడు వెంకటప్పయ్యల శైలి గురించి చెప్పారు. వారికి, తనకు విద్యార్థులుగా రెండు దశాబ్దాల తేడా ఉన్నదని, మా అందరికీ అవనీంద్ర నాథ్ టాగోర్-నందలాల్ బోస్‌లు అధ్యాపకులు కావడం సారూప్యత అని తెలిపారు. తొలితరం ఆధునిక తెలుగు చిత్రకారులకు స్వాతంత్ర్యానికి పూర్వం లభించిన గౌరవం ఆ తర్వాత కనుమరుగైందన్నారు. చలసాని ప్రసాదరావు, ఏలె లక్ష్మణ్, శ్రీధర్, వంటి చిత్రకారులు, శివాజీ, కిషోర్ తదితర జర్నలిస్టులు, జేఎన్‌టీయూ విద్యార్థులు పాల్గొన్న ఆ సభలో కొండపల్లి తన ముందుతరాల విశిష్ఠతను పరిచయం చేశారు. రుషులకు సెల్ఫ్ అప్రైజల్ ఉండదు కదా. ఇది కొండపల్లి శేషగిరిరావు శత జయంతి సందర్భం. చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో 25వ తేదీ నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు పెయింటింగ్స్ ప్రదర్శిస్తున్నారు. వారు మన కోసం పదిలపరచిన వ్యాసుడు-గణపతి, రాఘవుడు-గుహుడు, వరూధిని-ప్రవరాఖ్య, మురారి, శకుంతల, గోదాదేవి, అభినవ గుప్తుడు, రామప్ప శిల్పాల వంటి అసంఖ్యాక చిత్రాల్లో ఎంపిక చేసిన చిత్రాలు కొలువై ఉన్నాయి. కలువల కొలనులో కలువ కనుల సుందరి, పల్లెల రమణీయత, ప్రకృతి దృశ్యాలు, ముఖ్యంగా తెలంగాణ వైవిధ్య జీవితం ఆహ్లాదపరుస్తాయి.

# దాగని సత్యం



'దేవుని ఎదుట ప్రమాణం చేసి అంతా నిజమే చెప్తాను. అబద్ధం చెప్పను' అని అందరూ సత్యమే చెబుతారనుకుంటే అంతకంటే వెర్రితనం ఉండదు. కానీ, వెనుకబడిన గ్రామాల్లో ప్రమాణం చేస్తే సత్యమే పలుకుతారన్న నమ్మకం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. ఇందులో ఎలాంటి శాస్త్రీయత ఉండదు. కాబట్టే కొంతమంది పెద్దలు తమ స్వార్థం కోసం ఇప్పటికీ ఆ ప్రజల నమ్మకాన్ని అనుకూలంగా మలుచుకుంటున్నారు. 'ముల్లును ముల్లుతోనే తీయాలి' అన్న 'శాస్త్రంగా' పెద్దల దుష్టబుద్ధిని నాటకీయంగా బయట పెట్టింది ఈ 'అ-సత్యం' నాటిక. తెరతీయగానే ఊళ్లో సత్తెమ్మ తల్లి ఎదుట, ఊరి పెద్దలు, ప్రజల ఎదుట.. 'బుచ్చమ్మ గారి చిన్నబ్బాయి దగ్గర, తొలకరి జల్లుల్లో లక్ష రూపాయల రొక్కం చేబదులు తీసుకున్న మాట నిజం. తర్వాత రెండు నెలలకే నేను ఆ సొమ్ము చిన్నబ్బాయికి తిరిగి ఇచ్చేసాను. ఇది సత్తెం. ఇది సత్తెం. ఇది సత్తెం' అని వెంకట్రావు అనే సామాన్య రైతు ప్రమాణం చేసి దీపం ఆర్పుతాడు. వెనువెంటనే పక్షవాతంతో మెలితిరిగిపోతూ కూలబడిపోతాడు. వెంకట్రావు అబద్ధం చెప్పాడు కనుకనే ఇలా అయిపోయాడని ఊరి జనమంతా అనుకుంటారు. కానీ, శివయ్య అనే పెద్ద మనిషికి వెంకట్రావు నిజాయతీ తెలుసు. కాబట్టి చిన్నబ్బాయే మోసం చేసి ఉంటాడని భావించాడు. చిన్నబ్బాయి అన్న పెద్దబ్బాయి భార్య గర్భవతి అవుతుంది. పెద్దబ్బాయి కాస్త అమాయకుడు. అతని భార్య మూగ. దీన్ని ఆసరాగా చేసుకొని యావదాస్తినీ చిన్నబ్బాయే అనుభవిస్తుంటాడు. ఇప్పుడు అన్నకు కొడుకు పుడితే, తన పెత్తనానికే ఆటంకం ఏర్పడుతుందని, ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందన్న బాధ పట్టుకుంటుంది. అమాయకురాలైన వదినపై లేనిపోని అభాండాలు వేస్తాడు చిన్నబ్బాయి. 'ఇంత పెద్ద వయసులో గర్భం దాల్చడమేంటి?' అని నానా పుకార్లు పుట్టిస్తాడు. ఈ దుష్ట పన్నాగంలో చిన్నబ్బాయికి ఊరి సర్పంచ్ మొదటి నుంచి సహకరిస్తుంటాడు. చిన్నబ్బాయి పుకార్లతోనే ఆపకుండా, ఓ అర్ధరాత్రి వేళ అన్నలేని సమయంలో ముసుగు వేసుకుని వచ్చి వదినపై పెట్రోలు పోసి నిర్దాక్షిణ్యంగా సజీవ దహనం చేస్తాడు. ఆమె హాహాకారాలు చేస్తూ మరణిస్తుంది. ఆ సమయంలో చిన్నబ్బాయి మొలలోని తాళాల గుత్తి అక్కడ పడిపోతుంది. ఆ కంగారులో ఆయన ఈ విషయాన్ని గుర్తించకుండానే పారిపోతాడు. అభాండాలు తట్టుకోలేక వదిన ఆత్మహత్యకు పాల్పడిందని చిన్నబ్బాయి ప్రచారం చేస్తాడు. భార్య మరణాన్ని తట్టుకోలేక ఊరు విడిచిపోవాలని నిర్ణయించుకుంటాడు పెద్దబ్బాయి. ఓ రోజు అర్ధరాత్రి శివయ్య ఇంటికి వచ్చి తన బాధనంతా చెప్పుకొని బావురుమంటాడు. 'ఆస్తి చాలా పాపిష్టిది మావా! అయిన వాళ్లను కూడా పొట్టన పెట్టుకుంటుంది. ఇవి నా పొలం కాగితాలు. నీ వద్దే ఉంచు. ఇవి మా ఇంటి బోషాణం పెట్టి తాళాలు. తీసుకో, మనం కలుసుకున్నట్టు ఎవరికీ తెలియకూడదు. రహస్యంగానే ఉండాలి. మళ్లీ తిరిగి వచ్చినప్పుడే ఇవి తీసుకుంటాను. అప్పటివరకు నా ఆస్తి నీదే' అంటూ భార్యను తలుచుకుంటూ ఏడుస్తూ ఎటో వెళ్లిపోతాడు పెద్దబ్బాయి. శివయ్యకు విషయం అంతా బోధపడింది. ఇక తను కథను నడిపిస్తాడు. పెద్దబ్బాయి పొలం కాగితాలు తన వద్ద తాకట్టుపెట్టి పాతిక లక్షలు అప్పు తీసుకున్నాడని, ఆ డబ్బు తిరిగి ఇస్తే పొలం కాగితాలు ఇస్తానని చిన్నబ్బాయికి కబురు చేస్తాడు శివయ్య. చిన్నబ్బాయి కాగితాలు చూసి నిర్ఘాంతపోతాడు. తన అన్న అప్పు తీసుకున్నట్టు శివయ్య ఊరి జనం సమక్షంలో సత్తెమ్మ తల్లి వద్ద ప్రమాణం చేయాలని చిన్నబ్బాయి అడుగుతాడు. శివయ్య సరేనంటాడు. అన్నట్టే ప్రమాణం చేసి డబ్బు తీసుకుంటాడు. అప్పుడు తాళాల గుత్తి కూడా చిన్నబ్బాయికి ఇస్తాడు. తన దుర్మార్గ రహస్యం బయటపడటంతో చిన్నబ్బాయికి ఆందోళనతో పక్షవాతం వచ్చి కాలు చేయి పడిపోతుంది. ఆయన ఇచ్చిన పాతిక లక్షల సొమ్మును తను వాడుకోకుండా ఇంటి పక్కనే ఉండే ఓ కూలీకి ఇస్తాడు. ఆ కూలీ పసిబిడ్డ దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స కోసం ఉచితంగా ఇస్తాడు. 'పెద్దబ్బాయి మూగ భార్య కడుపులో కాలిపోయిన పసిగుడ్డు, ఈ పసివాడి నవ్వులో జీవం పోసుకోవాలి' అంటుండగానే తెరపడుతుంది. 'సాటి ప్రాణులకు ఏది మంచిదో అదే సత్యం' అన్న సందేశంతో నాటిక ముగుస్తుంది. అజో %-% విభో %-% కందాళం వారు, జాషువా సాంస్కృతిక వేదిక సంయుక్తంగా ఇటీవల విజయవాడలో నిర్వహించిన 2025 కథా నాటికల పోటీలో ఈ నాటిక ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. నాటిక ఆద్యంతం ఉద్విగ్నభరితంగా సాగడానికి సంగీతం ప్రాణంగా నిలిచింది. ఉత్తమ ప్రదర్శనతోపాటు ఉత్తమ దర్శకత్వం, ఉత్తమ సంగీతం బహుమతులను కూడా ఈ నాటిక గెలుచుకున్నది.



# స్పెషల్ టెస్టులు అవసరమా?

మా పాపకు తొమ్మిది నెలలు. వారం క్రితం బాగా జ్వరం వచ్చింది. డాక్టర్ దగ్గరికి తీసుకుపోతే మందులు రాశారు. తగ్గలేదు. జ్వరం తప్ప జలుబు, దగ్గు వంటి వేరే ఇబ్బందులేవీ లేవు. మూత్రపరీక్ష చేయిస్తే యూరిన్ ఇన్ఫెక్షన్ ఉందని రిపోర్ట్ వచ్చింది. డాక్టర్ యాంటిబయాటిక్ మందులు ఇచ్చారు. అవి వాడిన తర్వాత జ్వరం పూర్తిగా తగ్గింది. పాప హుషారుగానే ఉంది. డాక్టర్‌కి చూపించినప్పుడు యూరిన్ ఇన్ఫెక్షన్ ఉంది కాబట్టి అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేయించమన్నారు. అది కూడా చేయించాం. ఆ తర్వాత మూత్రం వెనక్కి పోతుందనే సందేహం ఉంది.. కాబట్టి మరో స్కాన్ చేయాలంటున్నారు. నిజంగా అది అవసరమా? మీరు చెప్పిన వివరాల ప్రకారం మీ బిడ్డకు యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ (యూటీఐ) ఉంది. చిన్నపిల్లల్లో ఇలాంటి సమస్య ఉంటే ఇన్ఫెక్షన్ ఎక్కడ ఉందో తెలుసుకోవడానికి అల్ట్రా సౌండ్ స్కాన్ చేస్తారు. ఈ స్కాన్ ద్వారా ఇన్ఫెక్షన్ కిడ్నీల్లో ఉందా? మూత్రనాళాల్లో ఉందా? కేవలం మూత్రాశయంలో ఉందా? అనేది తెలుస్తుంది. కొంతమందిలో అరుదుగా పుట్టుకతోనే మూత్ర విసర్జక వ్యవస్థ నిర్మాణంలో లోపాలు ఉంటాయి. అలాంటి సమస్యలు ఏవైనా ఉంటే అల్ట్రా సౌండ్ పరీక్షలో తెలుస్తాయి. ఈ పరీక్ష చేశారు. కాబట్టి మీ బిడ్డకు ఇన్ఫెక్షన్ ఎక్కడ ఉందో డాక్టర్‌కు తెలిసే ఉంటుంది. కానీ, ఆ ఇన్ఫెక్షన్‌కు కచ్చితమైన కారణం కూడా తెలియాలి. సాధారణంగా కిడ్నీలు రక్తాన్ని శుద్ధి చేసి నీరు, వ్యర్థాలను వడపోస్తాయి. కిడ్నీల్లో మూత్రం నాళాల ద్వారా కిందికి వచ్చి మూత్రాశయానికి చేరుతుంది. ఆ మూత్రాశయం నుంచి జననాంగంలోని మూత్రనాళం ద్వారా బయటికి పోతుంది. కొంతమంది పిల్లల్లో పుట్టుకతోనే మూత్ర విసర్జన సమస్య ఉంటుంది. మూత్రాశయం నుంచి వ్యతిరేక దిశలో మూత్రం ప్రయాణిస్తుంది. వెసికో యూరెటెరిక్ రిఫ్లక్స్ అంటాం. ఈ సమస్య ఉన్నట్టయితే బిడ్డకు యూరిన్ ఇన్ఫెక్షన్ తగ్గినా తర్వాత రాకుండా ఉండేందుకు కూడా కొద్ది మోతాదులో యాంటిబయాటిక్ మందులు వాడాల్సి ఉంటుంది. దాదాపు రెండు సంవత్సరాల వయసు వరకు వాడాలి. రెండేళ్ల వయసు దాటిన తర్వాత సమస్య ఉన్నదీ, లేనిదీ మెచ్యురేటింగ్ సిస్టో యురెథ్రోగ్రామ్ (ఎంసీయూజీ) పరీక్ష ద్వారా తెలుసుకుంటారు. మూత్రం వచ్చే మార్గంలో ట్యూబ్ పెట్టి, రంగు నీటిని అందులోకి పంపుతారు. ఆ నీరు మూత్రనాళంలో దిగువకు కాకుండా పైకి ప్రయాణిస్తే ఎంసీయూజీ పరీక్షలో గుర్తించవచ్చు. మీ పాపకు బహుశా ఎంసీయూజీ పరీక్ష చేయాలని వైద్యులు సూచించి ఉండవచ్చు. ముందు బిడ్డకు వెసికో యురెటెరిక్ రిఫ్లక్స్ సమస్య ఉందా? లేదా? తెలుసుకోవాలి. ఉంటే యాంటిబయాటిక్ మందులు వాడి సమస్యను తగ్గించుకోవచ్చు. యూరిన్ ఇన్ఫెక్షన్ రాకుండా బిడ్డకు నీళ్లు బాగా తాగించాలి. న్యాపీ వాడుతున్నట్లయితే సమయానికి మార్చాలి. న్యాపీ తీసిన తర్వాత వెనక భాగం తర్వాత ముందు భాగం శుభ్రం చేయకుండా, ముందు భాగం నుంచి వెనక్కి శుభ్రం చేయాలి.